సోమవారం
11-07-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 20
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

లక్ష్యం ఎన్నికలే!

- రెండేళ్ల ముందుగానే వైసీపీ ఆరాటం
- ప్రజా సమస్యలు పట్టని వైనం
- ప్రత్యేక హోదా, విభజన హామీలు గాలికి
- మోదీ-జగన్ రహస్య ఒప్పందం!
- బీజేపీతో జనసేన తెగదెంపులు?
- టీడీపీ బలోపేతమే లక్ష్యంగా బాబు పర్యటనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో అప్పుడే ఎన్నికల సందడి ఆరంభమైంది. రెండేళ్ల ముందు నుంచి ప్రతిపక్ష పార్టీలు ఎన్నికలకు సమయాత్తం కావడం ఆనవాయితీ. ఈ విడత అధికార పక్షం సైతం..ప్రజా సమస్యల్ని, రాష్ట్రాభివృద్ధిని విస్మరించి, 2024లో జరగనున్న ఎన్నికల (పార్లమెంట్, శాసనసభ)కు సై అంటోంది. వైసీపీ... మూడో విడత ప్లీనరీని ఈనెల 8, 9 తేదీల్లో విజయవాడ-గుంటూరు జాతీయ రహదారి పక్కన(ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట) నిర్వహించి, ఎన్నికల సమరశంఖారావం పూరించింది. అంతకుముందు నియోజకవర్గాలు/ జిల్లా కేంద్రాల్లో వైసీపీ ప్లీనరీలు పూర్తి చేసుకుంది. రెండు రోజులపాటు జరిగిన వైసీపీ ప్లీనరీ చర్చల్లో రాష్ట్రాభివృద్ధితోపాటు, ప్రజా సమస్యలపై ప్రధాన దృష్టి పెట్టే తీర్మానాలు వస్తాయని ప్రజలు ఆశించగా, జగన్‌ను పార్టీ శాశ్వత అధ్యక్షుడిగా చేసే తీర్మానం ఆమోదించడానికే సరిపెట్టారు. ఇదే వేదికపై నుంచి 175/175 సీట్లు తెచ్చుకోవాలన్న జగన్ సందేశం... ఇక వైసీపీ సైతం ఎన్నికల సమరానికి సిద్ధమైనట్లు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చినట్లయింది. టీడీపీ... పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టింది. టీడీపీ ఇటీవల ఒంగోలులో మహానాడు నిర్వహించి, ఆ పార్టీ అధినేత చంద్రబాబు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అప్పటి నుంచి మినీ మహానాడు పేరిట చంద్రబాబు వివిధ జిల్లాలు/నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్, జనవాని-జనసేన భరోసా కార్యక్రమాలతో ముందుకు వస్తున్నారు. బీజేపీ తన ఉనికిని కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతోంది. విజయవాడలో బీజేపీ పదాధికారుల సమావేశాన్ని నిర్వహించి, భవిష్యత్తులో పార్టీ బలోపేతంపై దృష్టి సారించింది. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీకి డిపాజిట్లు గల్లంతవ్వడంతో మరోసారి కోలుకోలేని దెబ్బతగిలింది. ఇప్పటివరకు బీజేపీ-జనసేన మధ్య పొత్తు ఉన్నట్లు భావిస్తుండగా, జనసేన మాత్రం టీడీపీకి నెమ్మదిగా దగ్గరవుతోంది. భీమవరంలో అల్లూరి జయంతి సభకు మోదీ రాగా, పవన్ కల్యాణ్‌కు ఆహ్వానం అందించినా, ఆయన హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. అల్లూరి జయంతి సభకు సీఎం జగన్‌తోపాటు వైసీపీ మంత్రులు, బీజేపీ ముఖ్యనేతలు వెళ్లారు. తెలంగాణ పర్యటనలో మోదీ...కేసీఆర్‌పై ధ్వజమెత్తగా, భీమవరం వేదికగా జగన్‌ను మోదీ పన్నెత్తి మాటనలేదు. ఇక విభజన హామీలు, ప్రత్యేక హోదా అంశంపై మోదీ ప్రస్తావనే లేదు. దీనిపై సీఎం జగన్, ఎంపీలు సైతం మోదీని డిమాండ్ చేయకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

హోదా కోసం ఒత్తిడేదీ ?

ఎలాంటి షరతు లేకుండా రాజ్యసభ అభ్యర్థికి జగన్ మద్దతివ్వడాన్ని విపక్షాలు తప్పుపడుతున్నాయి. ఇదే అదునుగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి, రాష్ట్రాభివృద్ధికి అవసరమైన ప్రయోజనాలు చేకూర్చాల్సి ఉంది. అలాంటివేమీ జగన్ చేయకుండా, గన్నవరం విమానాశ్రయంలో మోదీకి ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ ఒక వినతిపత్రం ఇచ్చి మౌనంగా ఉండిపోయారు. హోదా, విభజన హామీల సాధన కోసం ఇప్పుడు మోదీపై జగన్ గట్టిగా ఒత్తిడి చేస్తే, కేంద్రం తలొగ్గే అవకాశముంది. జగన్ తన సొంత అజెండాతోనే కేసులకు భయపడి, మోదీకి వత్తాసు పలుకుతున్నారని విపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి. ప్రస్తుత పరిస్థితులను బట్టి మోదీ-జగన్ మధ్య లోపాయికారీ ఒప్పందం నెలకొన్నట్లు స్పష్టమవుతోంది. మోదీ-జగన్ వ్యవహారం పెళ్లి చేసుకోకుండానే సహజీవనం సాగిస్తున్నట్లుందని విపక్షాలు ఎద్దేవా చేస్తున్నాయి. దీంతో 2024 ఎన్నికల వరకు మోదీ-జగన్ ఇలాగే స్నేహం కొనసాగిస్తూ, ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వస్తే, ప్రత్యేక హోదా పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు మద్దతిస్తుందనే ప్రచారముంది. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వంలోనూ చేరే అవకాశముందంటూ ఓ వైసీపీ ఎంపీ లీక్ చేయడం వివాదస్పదంగా మారింది. బీజేపీతో నేరుగా వైసీపీ పొత్తు పెట్టుకుంటే, వైసీపీకి వెన్నుదన్నుగా ఉన్న ఎస్సీ,ఎస్టీ, క్రైస్తవ, ముస్లిం సోదరుల ఓటు బ్యాంక్ చీలిపోతుందన్న భయం ఆ పార్టీలో నెలకొంది. వ్యూహాత్మకంగా రాబోయే ఎన్నికల తర్వాత, హోదా పేరుతో కేంద్రంలోని బీజేపీ

- మిగతా 2 లో

సడలని నిరసన

- శ్రీలంకలో అధ్యక్ష, ప్రధాని భవనాలను వీడని ఆందోళనకారులు
- 13న అధ్యక్షుడు గొటబాయ రాజీనామా చేస్తారని ప్రకటన
- శాంతికి ప్రజలు మద్దతు ఇవ్వాలన్న సైనిక ప్రధానాధికారి
- అండగా నిలుస్తాం: భారత్

కొలంబో:
శ్రీలంకలో ప్రజా నిరసన కొనసాగుతోంది. ఆందోళనకారులు ఆదివారం కూడా అధ్యక్ష భవనాన్ని వీడలేదు. వేలాది మంది ఇంకా వీధుల్లో తమ నిరసనను కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శాంతిని నెలకొల్పేందుకు ప్రజలు మద్దతు ఇవ్వాలని సైనిక ప్రధానాధికారి అభ్యర్థించారు. మరోవైపు, దేశ అధ్యక్షుడు గొటబాయ రాజపక్స 13వ తేదీన రాజీనామా చేస్తారని పార్లమెంట్ స్పీకర్ ప్రకటించారు. ఇదిలాఉండగా, అధ్యక్షుడు, ప్రధానమంత్రి తమ అధికారిక నివాసాలను వదిలి పారిపోయేలా చేసిన ప్రభుత్వ వ్యతిరేక నిరసన ఉద్యమ నాయకులు మాట్లాడుతూ ఇద్దరూ రాజీనామా చేసే వరకు తాము భవనాలను ఆక్రమిస్తామని ఆదివారం చెప్పారు. 'అధ్యక్షుడు, ప్రధాన మంత్రి రాజీనామా చేయాలి. ప్రభుత్వం దిగిపోవాలి' అని నాటక రచయిత రువంతీ డి చికెరాని ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది. ఇదిలావుండగా, అధ్యక్షుడు, ప్రధాన మంత్రి తమ పదవులకు రాజీనామా చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై చర్చించడానికి శ్రీలంక ప్రతిపక్ష పార్టీలు ఆదివారం సమావేశం అయ్యాయి. పార్లమెంటరీ స్పీకర్ పేర్కొన్న వివరాల ప్రకారం, శనివారం రాజధానిని కదిలించిన హింసాత్మక నిరసనల నేపథ్యంలో అధ్యక్షుడు గొటబాయ రాజపక్స జులై 13న పదవీ విరమణ చేయనున్నారు. ప్రదర్శనకారులు

- మిగతా 2 లో

అమర్‌నాథ్ యాత్ర నిలిపివేత

ప్రతికూల వాతావరణంతో కొత్త బ్యాచ్‌కి అనుమతి నిరాకరణ 2 లో

వానలే...వానలు

- వరదనీటిలో వందలాది గ్రామాలు
- విద్యుత్ సదుపాయం లేక అంధకారం
- పొంగిపొర్లుతున్న నదులు
- నిండుకుండల్లా ప్రాజెక్టులు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం:
రాష్ట్రవ్యాప్తంగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. నదులు, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తు కారణంగా వస్తున్న వరదతో ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేక గ్రామాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అనేక చోట్ల రహదారులకు గండ్లు ఏర్పడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉత్తరాంధ్ర ఏజెన్సీ గ్రామాల్లో వర్షం కష్టాలు వర్ణనాతీతం. గ్రామాల్లో రెండు రోజులుగా విద్యుత్ సరఫరా లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రానున్న నాలుగైదు రోజుల్లో గోదావరికి తీవ్ర వరద పోటు తలెత్తుతుందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి పోటెత్తింది. ధవళేశ్వరం నుంచి 2.21 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. ఇప్పటికే బ్యారేజీ నీటిమట్టం 13.65 అడుగులకు చేరుకుంది. 175 గేట్ల ద్వారా వరద నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో తుంగభద్ర జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. ఇటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో

- మిగతా 2 లో

ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ పరవళ్లు

బలివే వద్ద తమ్మిలేరు పై గండి

భారత్ సహా ఐదు దేశాల రాయబారుల తొలగింపు

జెలెన్‌స్కీ సంచలన నిర్ణయం

2 లో

నిషేధంపై... మడమ తిప్పడమే!

- అమలు కష్టసాధ్యమే
- ప్రధాన ఆదాయ వనరు ఇదే
- ఏరులై పారుతున్న అక్రమ మద్యం

'మద్య నిషేధం'... గతంలో ఎన్‌టీఆర్ సీఎంగా ఉండగా జరిగినా, ఆపై మసకబారిపోయింది. తాజాగా ఈ నినాదాన్ని నెత్తికెత్తుకున్న వైసీపీ అధినేత జగన్, దాన్ని అమలు చేయలేక పిల్లిమొగ్గలేస్తున్నారు. ప్రధాన ఆదాయ వనరు ఇదే అయ్యేసరికి ముందు నుయ్యి, వెనుక గొయ్యి చందంగా మారింది. ఆచరణ కష్టసాధ్యమయ్యే సరికి మడమ తిప్పక తప్పని పరిస్థితి ఏర్పడింది.

విశాలాంధ్ర-డిజిటల్:
'మద్యాన్ని దశలవారీ పూర్తిగా నిషేధిస్తా. కుటుంబాల్లో వెలుగులు నింపుతా' అంటూ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించిన వైసీపీ అధినేత జగన్, మద్యం నిషేధంపై మడమ తిప్పే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆదాయ వనరుల్లో మద్యం ముఖ్య భూమిక పోషిస్తుండడం, రెవెన్యూ లోటు, పరిమితికి మించి అప్పులు, సంక్షేమ పథకాలు తలకుమించి భారంగా మారడంతో తెలివైన ఏ ముఖ్యమంత్రీ బంగారు బాతు వంటి మద్యంపై వచ్చే ఆదాయాన్ని వదులుకోలేరు. మద్యాన్ని ఫైవ్‌స్టార్ హోటళ్లకు పరిమితం చేయడం దొడ్డి దారికి తలుపులు తీసినట్టేనని, రోజూ డబ్బు వచ్చే వ్యాపారాన్ని ఎవరూ వదులుకోరని, మద్యం ఆదాయం లేకపోతే ఆ ప్రభావం సంక్షేమ పథకాల అమలుపై పడుతుందని అప్పుడైనా యూటర్న్ తీసుకోవడం తప్పదని రాజకీయ విశ్లేషకులు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

జలగలా పీడిస్తున్న బీజేపీ

- దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ
- తెలంగాణ సర్కార్ ఇంజిన్ సూపర్ స్పీడ్
- ఇలాంటిదే ఢిల్లీలోనూ ఉండాలి
- కేంద్రంపై సీఎం కేసీఆర్ ఫైర్

విశాలాంధ్ర-హైదరాబాద్:
చేతగాని బీజేపీ ప్రభుత్వం ఇక్కడుండి చేసేదేంటని సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. దేశాన్ని బీజేపీ జలగలా పట్టి పీడిస్తోందని విమర్శించారు. ప్రగతి భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీపై విరుచుకుపడ్డారు. 'ఇటీవల బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు హైదరాబాద్‌లో పెట్టారు. ఆ సమావేశాల్లో గతంలో సాధించిన విజయాలు, చేయబోయే కార్యక్రమాల గురించి సందేశం ఇవ్వాలి. కానీ, ప్రధానమంత్రి ఏం మాట్లాడారో భగవంతునికే ఎరుక. రాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంలో యశ్వంత్ సిన్హా వచ్చిన సందర్భంగా ప్రధాని మోదీని నేను కొన్ని ప్రశ్నలు అడిగా. టీఆర్ఎస్ అడిగిన ఒక్క ప్రశ్నకు కూడా మోదీ, మంత్రులు సమాధానం చెప్పలేదు. వారి డొల్లతనాన్ని బయటపెట్టారు. తెలంగాణ గురించి బీజేపీ సభలో ఎలాంటి హామీలు ఇవ్వలేదు. ప్రధాని మోదీ అవివేక, అసమర్థ పాలన కొనసాగిస్తున్నారు' అని ఎద్దేశా చేశారు. ఇంకా మాట్లాడుతూ 'మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూపాయి విలువ పతనమైందని గొంతు చించుకుని చెప్పారు. ఇప్పుడు రూపాయి విలువ ఎందుకు పడిపోయిందో ఆయనే చెప్పాలి. బీజేపీ అసమర్థత వల్లే డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.80కి పడిపోయింది. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మోదీ హయాంలో రూపాయి విలువ పతనమైంది. దేశానికి మోదీ చేసిన మంచి పని ఒక్కటైనా చెప్పగలరా? తెలంగాణ తప్ప దేశమంతా చెడ్డ పవర్ పాలసీ తీసుకొచ్చారు. సాగునీరు ఇవ్వలేరు, తాగునీరు ఇవ్వడం చేతకాదు. దేశంలో 70వేల టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఇవ్వడం కూడా చేతకాదా? దేశ రాజధానిలో కరెంటు కోతలు, మంచినీటి కొరత ఉంది. ఇదే మీ పాలనకు నిదర్శనం. తెలంగాణలో జరిగే అభివృద్ధిలో కనీసం 10శాతమైనా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరుగుతోందా? అసమర్థ విధానాల వల్ల దేశాన్ని ఆగం పట్టించారు. రూపాయి పతనం ఆపలేరు, నిరుద్యోగాన్ని కట్టడి చేయలేరు. లొల్లి పెట్టడం ఒక్కటే మీకు చేతనైంది. భాజపా పాలన అంతా అప్రజాస్వామిక విధానాలు, అవినీతి, కుంభకోణాలమయం. కేంద్రంలో దద్దమ్మ ప్రభుత్వం ఉండటం వల్ల తెలంగాణ ప్రభుత్వం రూ.3లక్షల కోట్లు నష్టపోయింది. అసెంబ్లీలో ఇదే విషయం చెప్పా. దేశంలో ఏటా కోటి 30 లక్షల

- మిగతా 2 లో

భారత్ సహా ఐదు దేశాల రాయబారుల తొలగింపు

జెలెన్‌స్కీ సంచలన నిర్ణయం

కీవ్: ఉక్రెయిన్-రష్యా యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీ కీలక నిర్ణయం తీసుకున్నారు. భారత్ సహా ఐదు దేశాల్లోని తన రాయబారులను ఆయన తొలగించారు. ఈ మేరకు అధ్యక్షుడి వెబ్‌సైట్ ద్వారా అధికారిక ప్రకటన జారీ అయింది. జర్మనీ, భారత్, చెక్ రిపబ్లిక్, నార్వే, హంగేరీలలో ఉక్రెయిన్ రాయబారులను జెలెన్‌స్కీ తొలగించారు. వారి స్థానంలో కొత్త వారిని నియమిస్తారా లేదా అనే విషయమై స్పష్టత లేదు. అలాగే ఈ చర్యకు ఎటువంటి కారణాన్ని కూడా పేర్కొనలేదు. జర్మనీ, హంగేరీ, చెక్ రిపబ్లిక్, నార్వే, భారత దేశానికి చెందిన ఉక్రెయిన్ రాయబారులను తొలగించినట్టు జులై 9న జారీ అయిన ఉత్తర్వుల్లో జెలెన్‌స్కీ పేర్కొన్నారు. అదే సమయంలో ఇందులో ఉక్రెయిన్‌కు అంతర్జాతీయ మద్దతు, సైనిక సహాయాన్ని సమీకరించాలని జెలెన్‌స్కీ తన దౌత్యవేత్తలను కోరారు. ఫిబ్రవరి 24 నుంచి రష్యా యుద్ధాన్ని ఆపేందుకు ఉక్రెయిన్ ప్రయత్నిస్తోందని తెలిపారు.

జర్మనీ-ఉక్రెయిన్ మధ్య టర్బైన్లపై ప్రతిష్టంభన

జర్మనీ-ఉక్రెయిన్ మధ్య చాలా సున్నిత సంబంధాలున్నాయి. జర్మనీ... రష్యా ఇంధన సరఫరాలపై ఎక్కువగా ఆధారపడుతోంది. కెనడాలో మెయింటెనెన్స్‌లో ఉన్న జర్మనీ తయారీ టర్బైన్స్‌పై ప్రస్తుతం రెండు దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. రష్యా సహజ వాయువు దిగ్గజం గాజ్‌ప్రోమ్‌కు కెనడా టర్బైన్‌లను సరఫరా చేయాలని జర్మనీ కోరుతోంది. అదే సమయంలో, టర్బైన్‌లను సరఫరా చేయవద్దని ఉక్రెయిన్ కెనడాను కోరింది. రష్యాకు ఇస్తే... దానిపై విధించిన ఆంక్షలను ఉల్లంఘించినట్లేనని పేర్కొంది. ఈ పరిస్థితిలో జర్మనీలోని ఉక్రెయిన్ రాయబారి ఆండ్రీ మెల్నిక్‌ను ఉక్రెయిన్ అధ్యక్షుడు తొలగించడం కీలక పరిణామంగా పరిగణిస్తున్నారు. ఆండ్రీ మెల్నిక్, జర్మనీ రాయబారిగా 2014 చివరలో నియమితులయ్యారు. ఆయన అప్పటి నుంచి జర్మనీలోని రాజకీయ నాయకులు, దౌత్యవేత్తలతో సత్సంబంధాలు నెరుపుతున్నారు. జెలెన్‌స్కీ రష్యా ఆక్రమిత ఖేర్సన్ ఒబ్లాస్ట్ గవర్నర్ హెన్నాడీ లహూటాను కూడా తొలగించారు. సర్వెంట్ ఆఫ్ పీపుల్ పార్టీ నుంచి ఖేర్సన్ ఒబ్లాస్ట్ శాసనసభ సభ్యుడు డిమిత్రి బుట్రీని జెలెన్‌స్కీ తాత్కాలిక గవర్నర్‌గా నియమించారు.

మారియుపోల్‌లో పేలుళ్లు... ముగ్గురి మృతి

అజోవ్‌స్టాల్ స్టీల్ ప్లాంట్ సమీపంలో శనివారం రెండు పేలుళ్లు సంభవించినట్లు మారియుపోల్ మేయర్ సహాయకుడు పెట్రో ఆండ్రిష్చెంకో తెలిపారు. ఈ దాడిలో ముగ్గురు మృతి చెందగా, అనేకమంది గాయపడ్డారని తెలిపారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడి తర్వాత తమ విధులను నిర్వర్తించకుండా డిప్యూటీలు దేశం విడిచిపెట్టిన అంశంపై దర్యాప్తు చేయడానికి తాత్కాలిక దర్యాప్తు కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని పార్లమెంట్ స్పీకర్ రుస్లాన్ స్టెఫాన్‌చుక్ చెప్పారు.

రష్యా నుండి మైకోలైవ్‌పై క్షిపణుల దాడి

రష్యా సైన్యం శనివారం ఉదయం మైకోలైవ్‌పై ఆరు క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడిలో అనేక భవనాలు ధ్వంసమయ్యాయి. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ మేరకు మైకోలైవ్ మేయర్ అలెగ్జాండర్ సెంకెవిచ్ వెల్లడించారు.

ప్రజావిజయం అపహాస్యానికి అమెరికా యత్నం

క్యూబా విదేశాంగమంత్రి బ్రూనో రోడ్రిగ్జ్

హవానా: క్యూబాలో ప్రజా విజయాన్ని కించపరిచేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని ఆ దేశ విదేశాంగ మంత్రి బ్రూనో రోడ్రిగ్జ్ మండిపడ్డారు. అమెరికా క్యూబాపై అనుసరిస్తున్న నిర్బంధ విధానంలో భాగంగా ఆర్థిక, వాణిజ్య ఆంక్షలను కఠినతరం చేయడంతో పాటు 28మంది క్యూబా అధికారులకు వీసా పరిమితులను ప్రకటించిన నేపథ్యంలో క్యూబా విదేశాంగ మంత్రి రోడ్రిగ్జ్ స్పందించారు. అమెరికా చర్యను తీవ్రంగా ఖండిస్తూ ట్వీట్ చేశారు. '2021లో క్యూబాలో ప్రజల్లో తిరుగుబాటును రేకెత్తించే ప్రయత్నం విఫలమైన దృష్ట్యా, అమెరికా ప్రభుత్వం, దాని విదేశాంగ కార్యదర్శి ఆంటోనీ బ్లింకెన్ ఇప్పుడు సామ్రాజ్యవాద దురాక్రమణను ఎదుర్కొని ప్రజలు సాధించిన విజయాన్ని కించపరిచేందుకు ప్రయత్నిస్తున్నారు' అని పేర్కొన్నారు. అంతర్జాతీయ చట్టం, ఐక్య రాజ్యసమితి చార్టర్‌ను ఉల్లంఘిస్తూ అమెరికా పదేపదే ఇటువంటి చర్యలకు పాల్పడుతోందన్నారు. ప్రెసిడెన్షియల్ ప్రకటన 5377 ప్రకారం... మొత్తం 28 మంది ప్రభుత్వ ఉద్యోగులు, క్యూబా కమ్యూనిస్ట్ పార్టీ సభ్యులను భూభాగంలోకి ప్రవేశం చకుండా నిషేధించినట్లు బ్లింకెన్ కార్యాలయం శనివారం వెల్లడించింది.

బార్‌లో కాల్పులు: 14మంది దుర్మరణం

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాలోని ఓ బార్‌లో దుండగులు విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో 14 మంది మృతిచెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన జొహన్నెస్‌బర్గ్‌లోని సొవెటో టౌన్‌షిప్‌లో శనివారం అర్ధరాత్రి దాటాక చోటు చేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం... కొంతమంది మినీబస్ ట్యాక్సీలో ఆ బార్‌కు వచ్చి అక్కడున్నవారిపై కాల్పులు జరిపారు. బుల్లెట్ గాయాలతో 14 మంది అక్కడికక్కడే మృతిచెందారు. ఈ విషయం తెలిసిన పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలించారు. అందులో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉన్నట్టు వివరించారు. ఘటనాస్థలిలో దొరికిన కార్ట్రిడ్జ్‌లను పరిశీలిస్తే... ఒక్కరి కంటే ఎక్కువమందే కాల్పులు జరిపినట్టు తెలుస్తోందని గుటెంగ్ ప్రావిన్స్ పోలీసు కమిషనర్ లెఫ్టినెంట్ జనరల్ ఇలియస్ మవేలా వివరించారు. అనుమతించిన సమయాల్లోనే బార్ తెరిచి ఉందని, కొందరు బార్‌లో మత్తులో మునిగితేలుతుండగా హఠాత్తుగా కాల్పుల శబ్దాలు రాగానే, అక్కడ ఉన్న వారంతా పరుగులు పెట్టారని పేర్కొన్నారు. కొంత మంది బయటకు పారిపోవడానికి ప్రయత్నిస్తుండగానే కాల్పులకు గురై మరణించినట్టు చెప్పారు.

వరవరరావు బెయిల్ పిటిషన్‌పై నేడు సుప్రీం కోర్టు విచారణ

న్యూఢిల్లీ: బీమా కోరేగావ్ కేసులో నిందితుడిగా ఉన్న వరవర రావు బెయిల్ పిటిషన్‌పై సుప్రం కోర్టు సోమవారం విచారణ జరుపనుంది. అనారోగ్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న తనకు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించిన బాంబే హైకోర్టు ఆదేశాలను సవాలు ఆయన సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ సుప్రీం న్యాయమూర్తులు జస్టిస్ యుయు లలిత్, ఎస్ రవీంద్ర భట్, సుధాన్షు ధులియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. వరవర రావు తరఫున న్యాయవాది నూపుర్ కుమార్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో బీమా కోరేగావ్ కేసులో వరవరరావు ఇప్పటికే రెండు సంవత్సరాలు అండర్ ట్రయల్ ఖైదీగా శిక్ష అనుభవించారని తెలిపారు. 83 ఏళ్ల వృద్ధాప్యంతో ఆయన తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న క్రమంలో మెడికల్ బెయిల్ కోసం బాంబే హైకోర్టులో వేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చిందని పేర్కొన్నారు. ఆరోగ్యం క్షీణిస్తున్న వరవరరావుకు శస్త్రచికిత్స కూడా చేయాల్సి ఉందని, ఈ క్రమంలో ఆయన్ను ఇంకా జైలులోనే ఉంచడం ప్రాణాలకు ముప్పుకలిగించే చర్య అవుతుందని పేర్కొంటూ బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థిస్తూ పిటిషన్ దాఖలు చేశారు.

వానలే...వానలు

(మొదటిపేజీ తరువాయి)

కురుస్తున్న భారీ వర్షాలకు వంశధార, నాగావళి, తోటపల్లి, జంజావతి, తాటిపూడి, రైవాడ, మేగాద్రి గెడ్డలో వరద నీటి ప్రవాహం అధికమైంది. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం లేదా అల్పపీడన ద్రోణి ఏర్పడే అవకాశం ఉందని ఇది బలపడితే వర్షాలు మరింత అధికంగా కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలియజేస్తున్నారు. మరోపక్క చురుగ్గా కదులుతున్న నైరుతి రుతుపవనాలకు ఆవర్తనాలు తోడవడంతో రెండు మూడు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో, భారత వాతావరణ విభాగం (ఐఎండీ) దేశంలోని పలు రాష్ట్రాలకు వర్ష సూచన చేసింది. రాగల మూడు రోజుల్లో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, ఒడిశా, చత్తీస్ గఢ్ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని ఐఎండీ వెల్లడించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు పడతాయని తెలిపింది. ముఖ్యంగా, రానున్న మూడు రోజులు పాటు కోస్తాంధ్ర, తెలంగాణ, యానాంలో అతి భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది. తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ వెల్లడించింది.

బలివేకు గండి

ముసునూరు: మండలంలోని కృష్ణా జిల్లా నుంచి పశ్చిమగోదావరి జిల్లా (ఏలూరు)లను కలుపు ముసునూరు మండలంలోని బలివే గ్రామం వద్ద ఉన్న తమ్మిలేరు వరద ఉధృతికి గండి పడింది. దీంతో రెండు జిల్లాల ప్రజల రాకపోకలకు పూర్తి అంతరాయం ఏర్పడింది. వర్షానికి తోడు ఈదురుగాలులకు రోడ్డుపై చెట్టు అడ్డంగా పడిపోయాయి.

ప్రకాశం బ్యారేజీకి వరద నీరు... 25 గేట్లు ఎత్తివేత

తాడేపల్లి: తాడేపల్లి సీతానగరం ప్రకాశం బ్యారేజీకి పెద్దఎత్తున వరద నీరు వచ్చి చేరింది. దీంతో బ్యారేజీ 25 గేట్లను తెరిచి నీటిని దిగువకు వదులుతున్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రకాశం బ్యారేజీకి వరద ప్రవాహం పెరిగిందని అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 42 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తున్నదన్నారు. ప్రకాశం బ్యారేజీ గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేయడం ఈ సీజన్‌లో ఇదే తొలిసారి. ఇప్పటికే కాల్వల ద్వారా ఖరీఫ్ సాగుకు కృష్ణా తూర్పు, పడమరలకు నీటిని విడుదల చేశారు. పరివాహక ప్రాంతాల ప్రజలు మరో రెండు రోజుల పాటు పశువులు, గొర్రెలు, మేకలను మేతకు తీసుకెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

లక్ష్యం ఎన్నికలే!

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం ఏర్పాటుకు వైసీపీ బహిరంగంగా మద్దతిచ్చినా ఆశ్చర్య పోనక్కర్లేదు.

అభివృద్ధిపై జగన్ మౌనం

రాష్ట్రాభివృద్ధిపైన అధికార సీఎం జగన్ దృష్టి పెట్టకుండా 2024 ఎన్నికలే లక్ష్యంగా ముందుకెళ్లడంపై తీవ్ర విమర్శలున్నాయి. వైసీపీ వచ్చే ఎన్నికల్లో 175/175 సీట్ల లక్ష్యంతో ఆ పార్టీ నిమగ్నమైంది. రాష్ట్రాభివృద్ధిపైన దృష్టి పెట్టకుండా, సంక్షేమ పథకాలతోనే సరిపెడుతోంది. మితిమీరిన అప్పులు తెస్తూ, సీఎం జగన్ బటన్ నొక్కి, ప్రజల ఖాతాల్లోకి వేయడం వెనుక రాజకీయ లబ్ధి కోసమేననే విమర్శలున్నాయి. వాటిని జగన్ ఖాతరు చేయకుండా, యథాతథంగా సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నారు. దీంతో ప్రతిపక్ష పార్టీలు దూకుడు పెంచాయి. టీడీపీ అధినేత చంద్రబాబు తన పర్యటనల్లో నిమగ్నమయ్యారు. గత ఎన్నికల్లో ఆ పార్టీకి 23 ఎమ్మెల్యే, మూడు ఎంపీ సీట్లు మాత్రమే దక్కాయి. ఆ ఎన్నికల్లో టీడీపీ ఘోర పరాజయాన్ని ఎదుర్కొంది. తర్వాత జరిగిన మున్సిపల్, మండల, జిల్లా పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ ఓటమి పాలైంది. వైసీపీకే అధిక స్థానాలు లభించాయి. దీంతో సంస్థాగతంగా టీడీపీ బలహీన పడింది. ఒక వైపు పార్టీ బలోపేతం, మరోవైపు 2024 ఎన్నికలే లక్ష్యంగా చంద్రబాబు ఉన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ సాంప్రదాయ ఓటింగ్ చాలా వరకు చేజారిపోయింది. రాబోయే ఎన్నికల బరిలో టీడీపీ ఒక్కటే పోటీకి దిగితే, మళ్లీ ప్రతిపక్షంలో ఉండిపోతుందనే సంకేతాలు ఆ పార్టీ నేతలకు వచ్చాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని పవన్ కల్యాణ్‌తో చంద్రబాబు సన్నిహితంగా మెలుగుతున్నారు. ఎన్నికల సమయానికి టీడీపీ,జనసేన పొత్తులు దాదాపు ఖరారయ్యే పరిస్థితులున్నాయి. రాష్ట్ర రాజకీయ పరిస్థితుల రీత్యా అవసరమైతే బీజేపీకి పవన్ దూరమయ్యే అవకాశాలు అధికంగా ఉన్నట్లు సమాచారం. అదే జరిగితే టీడీపీ-జనసేన కలిసి పోటీ అనేది నిజమవుతుంది. అప్పుడు బీజేపీ, వైసీపీలు ఒంటరిగా బరిలోకి దిగాల్సి ఉంటుంది. ఇప్పటికైనా అధికార వైసీపీ ఎన్నికల హడావుడి చేయకుండా, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరముంది.

గూండాయిజం అణచడానికే వచ్చా: పవన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గుండాయిజం, రౌడీయిజం అణచడానికే రాజకీయాల్లోకి వచ్చానని జనసేన అధినేత పవన్ కల్యాణ్ చెప్పారు. ఆదివారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పాతిక మంది రౌడీలను చూసి వేలాది మంది జనం భయపడుతున్నారన్నారు. రాష్ట్రం సమస్యల నిలయంగా మారిందని, టిడ్కో ఇళ్లు ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్నాయని విమర్శించారు. ప్రజలను వలంటీర్లు బెదిరిస్తున్నారని, మాఫియా వ్యవస్థలా వలంటీర్లు తయారయ్యారని దుయ్యబట్టారు.

84 మంది ఏపీ యాత్రికులు సురక్షితం

- ఇద్దరి ఆచూకీ గల్లంతు
- అమర్‌నాథ్ కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు

అమరావతి: అమర్‌నాథ్ యాత్రకు ఆంధ్రప్రదేశ్‌లోని వేర్వేరు ప్రాంతాల నుంచి వెళ్లిన దాదాపు 84 మంది సురక్షితంగా ఉన్నారని, అయితే ఆదివారం మధ్యాహ్నం వరకు ఇద్దరు మహిళల ఆచూకీ మాత్రమే తెలియరాలేదని అధికార వర్గాలు ఇక్కడ తెలిపాయి. తొలుత, ఐదుగురు యాత్రికులు గల్లంతయ్యారని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. కానీ తర్వాత ముగ్గురి ఆచూకీ లభించిందని, వారు సురక్షితంగా ఉన్నట్లు తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు చాలా మంది యాత్రికులతో, వారి కుటుంబ సభ్యులతో సంప్రదింపులు జరిపారు. అమర్‌నాథ్ గుహ సమీపంలో భారీ వర్షం, ఆకస్మిక వరదల తర్వాత యాత్రికులు సురక్షితంగా ఉన్నారని ధ్రువీకరించారు. ప్రభుత్వ వర్గాలు అందించిన వివరాల ప్రకారం, రాజమహేంద్రవరం నుంచి అమర్‌నాథ్‌కు 20 మంది యాత్రికుల బృందం వెళ్లింది. కానీ వారిలో ఇద్దరి ఆచూకీ తెలియరాలేదు. 'వారి భర్తలు శ్రీనగర్‌కు తిరిగి వచ్చారు. కానీ మహిళలు ఇంకా కనిపించలేదు. వారు గాయపడి ఉండవచ్చు లేదా వేరే ప్రదేశానికి చేరుకుని ఉండవచ్చు. వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టాం' అని సహాయ చర్యల్లో పాల్గొన్న ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి ఆదివారం రాజమహేంద్రవరంలో ఇద్దరు మహిళల బంధువులను పరామర్శించి పరిస్థితిని చర్చించారు. గుంటూరు నుంచి 38 మంది యాత్రికుల బృందం, తాడేపల్లిగూడెం నుంచి 17 మంది బృందం, తిరుపతి నుంచి ఆరుగురి సభ్యుల బృందం, విజయనగరం నుంచి మరొకరు సురక్షితంగా ఉన్నట్లు తెలిసింది. కడప జిల్లాలో రాజంపేట నుంచి కొంతమంది యాత్రికులు కూడా సురక్షితంగాఉన్నారని, కానీ వారు ఎంతమంది అనేది స్పష్టం కాలేదని ప్రభుత్వం తెలిపింది. స్థానిక అధికారులతో సమన్వయం చేసుకోవడానికి, ఏపీ యాత్రికుల భద్రతను నిర్ధారించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏపీ భవన్ అదనపు రెసిడెంట్ కమిషనర్ హిమాన్షు కౌశిక్‌ను శ్రీనగర్‌కు పంపినట్లు ఇక్కడ ఒక అధికార ప్రకటన పేర్కొంది. రాష్ట్రానికి చెందిన యాత్రికులకు అవసరమైన సహాయం అందించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ 1902 కూడా ప్రారంభించింది. యాత్రికులు, వారి బంధువులకు ఏదైనా సహాయం కోసం న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో హెల్ప్‌లైన్‌లను కూడా ఏర్పాటు చేశారు.

అమర్‌నాథ్ యాత్ర నిలిపివేత

జమ్ము: ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా జమ్ము నుంచి అమర్‌నాథ్ యాత్రను నిలిపివేశారు. దక్షిణ కాశ్మీర్ హిమాలయాల్లోని 3,880 మీటర్ల ఎత్తయిన గుహ వద్ద బేస్ క్యాంపులకు ఇక్కడి నుంచి కొత్త బ్యాచ్ వెళ్లేందుకు అనుమతి లేదని అధికారులు తెలిపారు. ఈనెల 8వ తేదీ శుక్రవారం సాయంత్రం అమర్‌నాథ్ వద్ద కురిసిన భారీ వర్షంతో ఒకేసారి పెద్ద ఎత్తున వరద రావడంతో 16 మంది మరణించారు. దాదాపు 40 మంది గల్లంతయ్యారు. 'వాతావరణం అనుకూలించకపోవడంతో జమ్ము నుంచి కశ్మీరులోని జంట బేస్ క్యాంప్‌లకు అమర్‌నాథ్ యాత్రను నిలిపివేశాం. అమర్‌నాథ్ వైపు కొత్త బ్యాచ్ ఎవరినీ అనుమతించడం లేదు' అని ఒక అధికారి చెప్పారు. జూన్ 29 నుంచి జమ్ములోని భగవతి నగర్ బేస్ క్యాంప్ నుంచి 10 బ్యాచ్‌ల్లో మొత్తం 69,535 మంది యాత్రికులు లోయకు బయలు దేరారు. రక్షా బంధన్ సందర్భంగా ఈ యాత్ర ఆగస్టు 11న ముగుస్తుంది.

నిషేధంపై... మడమ తిప్పడమే!

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చీ రాగానే హడావుడిగా బెల్టుషాపులు మూయించింది. నిషేధం పక్కన బెట్టి 'మాట తప్పను... మడం తిప్పనం'టూనే మద్యం తెగ తాగించేసి ఆదాయాన్ని విపరీతంగా పెంచుకుంటోంది. దీనికి సాక్ష్యమే మద్యం టార్గెట్ రూ.20 వేల కోట్లకు పెంచడం. షాపుల సంఖ్య తగ్గించినా ఆదాయం మాత్రం ఫుల్. 'బెల్టు' తీసినా, పక్క రాష్ట్రాల నుంచి మద్యం ఏరులై పారుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. రోజూ రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట మద్యం బాటిళ్ల పట్టివేత జరుగుతూనే ఉంటోంది. దీనికితోడు నిర్మానుష్య ప్రదేశాల్లో కాపుసారా బట్టీలు పుట్టుకొస్తూనే ఉన్నాయి.

ఏటా షాపుల సంఖ్యను తగ్గించుకుంటూ వస్తామని కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చింది జగన్ సర్కార్. అందులో భాగంగా దుకాణాల సంఖ్య తగ్గించి అమ్మకాల సమయాన్ని మార్చేసింది. అయినా సర్కారుకు ఆదాయం తగ్గలేదు. 2015-16లో అప్పటి టీడీపీ హయాంలో ప్రభుత్వానికి మద్యంపై వచ్చిన ఆదాయం అక్షరాల రూ.3839 కోట్లు. 2016-17లో రూ.4644 కోట్లు, 2017-18లో రూ.5789 కోట్లు, 2019లో రూ.17,625 కోట్లు, 2020-21లో రూ.18,000 కోట్లుగా అధికారిక లెక్కలు చెబుతున్నాయి. దీన్నిబట్టి ఐదేళ్లలో అమ్మకాల ద్వారా ఆదాయం ఐదు రెట్లు పెరిగినట్టు అర్థమవుతోంది. ఏపీ ప్రభుత్వం మద్య నిషేధంలో భాగంగా మొదటి దఫా మద్యం షాపులను 4380 నుంచి 3500 తగ్గించారు. రెండోసారి ఆ సంఖ్యను 2934కు పరిమితం చేశారు. షాపుల సంఖ్య సుమారు 33 శాతం తగ్గించినట్లయింది. అమ్మకాలను ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పరిమితం చేశారు. కానీ అమలులో విఫలమయ్యారు. అధికారుల అండదండలతో అర్థరాత్రి వరకూ అమ్మకాలు జరుగుతున్నాయి. ఆదాయం వస్తే చాలు తాగేవారి ఆరోగ్యం పోతే మాకేంటి అన్నట్టు ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఇక మద్యం తాగి రోడ్ల వెంట మందు బాబులు దొర్లే సన్నివేశాలు ప్రభుత్వానికి, అధికారులకు తెలియనివి కావు. మద్యపాన నిషేధం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఫార్ములా పెద్దగా ఫలితాలు ఇవ్వడం లేదు. షాపుల సంఖ్య తగ్గినా ఆదాయం 21 శాతం పెరిగింది. అమ్మకాల సరళిలో హెచ్చు తగ్గులు కనిపిస్తున్నా అమలు చేయాలనుకుంటున్న మద్య నిషేధంపై ప్రభావం చూపలేదని ఎక్సైజ్ అధికారులు అభిప్రాయ పడుతున్నారు. మద్యం ధరలు పెంచినా తాగేవారికీ, ప్రభుత్వ ఆదాయానికీ ఢోకా లేకుండా పోయింది.

ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) దుకాణాలు నిర్వహిస్తుండడంతో కొద్దిమేర అమ్మకాలపై ప్రభావం చూపినా ఆదాయానికి మాత్రం తగ్గలేదు. బార్లకు సరఫరా చేసే మద్యంపై అదనపు రిటైల్ టాక్స్ (ఏఆర్టీ) వసూళ్లతో ఆదాయం మరింత పెరిగింది. ఏపీ రెవెన్యూ వనరుల్లో మద్యంది రెండో స్థానం. అమ్మకాలూ టాప్‌లో ఉన్నాయి. సాధారణ దుకాణాల్లో రోజుకు సగటున రూ.2.50 లక్షల ఆదాయం ఉంటోంది. ఇదిలా ఉండగా, మద్యంపై పూర్తి నిషేధం విధించిన బీహార్, నాగాలాండ్, గుజరాత్, మిజోరం రాష్ట్రాలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ చట్టం కింద లక్షలాది మందిపై కేసులు పెట్టింది. విచారణ మాత్రం నత్త నడకన సాగుతోంది. అంటే మద్యం నిషేధిత రాష్ట్రాల్లో ఏవిధంగా పక్క రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం వచ్చి పడుతుందో అర్థమవుతోంది.

ఓటు వేయం: వృద్ధుడు

'నా వయసు 64. చిన్నప్పటి నుంచీ కష్టపడుతున్నా. ఇసుక, కంకరను డాబాలపైకి మోస్తా. మెట్లెక్కేటప్పుడు మోకాళ్లు, తొడ కండరాలు పట్టేస్తాయి. చీకటి పడగానే సంపాదనలో సగం మందుకే పోతుంది. తాగకపోతే మరుసటి రోజు పనికి వెళ్లలేను. కుటుంబాన్ని పోషించుకోవాలి గదా.. తాగడం తప్పదు పనికి వెళ్లడం తప్పదు. మందు నిషేధానికి రెండు ఏళ్లు ఉందంటున్నారు. నిషేధం అమలుచేసి ఓట్లు అడగడానికి వస్తే ఓటు వేయననే చెబుతా. నేనే కాదు నాలా కష్టజీవుల అభిప్రాయమూ ఇదే' అంటూ పేరు చెప్పడానికి, ఫొటో దిగడానికి ఇష్టపడని ఓ వృద్ధుడు స్పష్టం చేశాడు.

వైసీపీకి ఇదే ఆఖరి ప్లీనరీ: బొండా ఉమ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీకి ఇదే ఆఖరి ప్లీనరీ అని టీడీపీ నేత బొండా ఉమామహేశ్వరరావు ఎద్దేవా చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో అన్ని వర్గాల ప్రజల జీవితాలను జగన్ తల్లకిందులు చేశారన్నారు. ప్లీనరీ అంటే రాష్ట్రానికి చేసిన మంచి, తెచ్చిన అభివృద్ధి, రానున్న కాలంలో ప్రభుత్వం ఎలా ముందుకు వెళ్తుందో చెప్పుకోవడానికి నిర్వహిస్తారని చెప్పారు. జగన్‌ను అధికారంలోకి తీసుకురావడానికి తల్లి, చెల్లి ఎంతో సహకరించారని, ఇవాళ ఆయన వైఖరి నచ్చక వారిద్దరూ పక్క రాష్ట్రానికి వెళ్లిపోయారన్నారు. నాడు వైఎస్ఆర్ మరణం వెనుక రిలయన్స్ అధినేతల హస్తముందని, రిలయన్స్ పెట్రోల్ బంక్, షాపింగ్ మాళ్లను తగులబెట్టించారన్నారు. ప్లీనరీలో జగన్ హావభావాలు హాస్యాస్పదంగా ఉన్నాయని, ఈ మూడేళ్లలో రాష్ట్రానికి ఏం చేశావు? మళ్లీ నిన్ను ప్రజలు ఎందుకు ఎన్నుకోవాలో చెప్పాలంటూ డిమాండ్ చేశారు.

జలగలా పీడిస్తున్న బీజేపీ

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగాలు కోల్పోతున్నారు. వీళ్ల చేతగానితనాన్ని ప్రజలు చూశారు. అందుకే కేంద్రంలోని ప్రభుత్వం మారాలని చెబుతున్నాం. తప్పకుండా మారుస్తాం. డబుల్ ఇంజిన్ సర్కారు రావాలని మోదీ చెప్పారు. ఈ విషయంలో మోదీకి థ్యాంక్స్ చెబుతున్నా. తెలంగాణ సర్కారు ఇంజిన్ స్పీడ్‌గా ఉంది. కాబట్టే కేంద్రంలో కూడా తెలంగాణ సర్కారులా స్పీడ్‌గా ఉన్న ప్రభుత్వం రావాలి. ఆర్‌బీఐ లెక్కల ప్రకారం తెలంగాణ జీడీపీ 128.3శాతం ఉంటే కేంద్ర ప్రభుత్వం జీడీపీ 89.6శాతంగా ఉంది' అని కేసీఆర్ అన్నారు.

చేతగాని కేంద్రాన్ని కచ్చితంగా మారుస్తాం

'కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం పోవాలి.. బీజేపీయేతర ప్రభుత్వం రావాలి. తెలంగాణ స్థాయిలో కేంద్రం పనిచేస్తే తెలంగాణ జీడీపీ ఇంకా పెరుగుతుంది. చేతగాని కేంద్ర ప్రభుత్వాన్ని కచ్చితంగా మారుస్తాం. అలాంటి ప్రభుత్వం తెలంగాణలో మాకెందుకు? కేంద్ర ప్రభుత్వం వేగం తక్కువ.. రాష్ట్ర ప్రభుత్వం వేగం ఎక్కువ. కేంద్రంలో తప్పకుండా బీజేపీయేతర డబుల్ ఇంజిన్ సర్కార్ రావాల్సి ఉంది. బీజేపీ నేతలకు అహంకారం పెరిగింది. మొత్తం 119 స్థానాల్లో 110 సీట్లున్న చోట ఏక్‌నాథ్ షిండే వస్తారా? తెలంగాణలో మూడోవంతు మెజార్టీతో టీఆర్ఎస్ గెలిచింది. ఇదేనా మీ పాలసీ. నుపుర్ శర్మ వ్యాఖ్యలతో విదేశాల్లో భారత రాయబారిని నిలదీస్తే క్షమాపణ చెప్పారు. బీజేపీ అసమర్థ విధానాల వల్ల భారత్ పరువుపోతోంది. కట్టప్పలా.. కాకరకాయా? కట్టప్పలు, ఏక్‌నాథ్ షిండే.. ఇలాంటి కుక్కమూతి పిందెలా రాష్ట్రానికి కావాల్సింది? ఏక్‌నాథ్ షిండే వచ్చి ఏం చేశారు? మహారాష్ట్రలో 20శాతం విద్యుత్ ఛార్జీలు పెంచారు. మీ వల్ల ఏమవుతుంది. మన్నూ మశానం తప్ప"

రైతులను అవమానించేలా గోయల్ వ్యాఖ్యలు

'ప్రముఖ విలేకరులను నక్సలైట్లుగా చిత్రీకరిస్తున్నారు. ఏక్‌నాథ్ షిండేలను సృష్టిస్తామని బాహాటంగా చెబుతున్నారు. మీ ఉన్మాదం.. పిచ్చి ఎక్కడిదాకా పోతుంది? తెలంగాణ రైతులను అవమానించేలా కేంద్ర మంత్రి గోయల్ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో నూకలు ఎక్కువగా వస్తాయంటే.. అవే తినాలన్నారు. దేశంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి.. పోయాయి... అంతకంటే గొప్ప పంటలకు సంబంధించి కేంద్రానికి ఏమైనా విధానం ఉందా? బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా రైతు బీమా అమల్లో ఉందా? వాణిజ్య, వ్యవసాయశాఖకు సమన్వయం లేదని భారతీయ కిసాన్‌సంఘ్ చెప్పింది. ప్రస్తుతం దేశంలో అప్రకటిత అత్యయికపరిస్థితి నడుస్తోంది. సర్కారు నడుపుతున్నారా? గూండాయిజం చలాయిస్తున్నారా? మోదీకి తెలియకుండా బ్యాంకు లూటీలు జరగట్లేదు. బ్యాంకులను దోపిడీ చేసిన వారిని వెనక్కి రప్పించలేకపోతున్నారు. ఇప్పటివరకూ వరకూ ఒక్క దొంగనైనా పట్టుకున్నారా? మోదీ గారూ.. బ్యాంకు దొంగల్ని మీ ఈడీలు, సీబీఐలు పట్టుకోవా? బ్యాంకు దొంగలను పట్టుకోవట్లేదంటే మీరు కూడా భాగస్వామ్యమే. అన్ని వివరాలను ప్రజలముందు ఉంచుతాం" అంటూ సీఎం కేసీఆర్ తీవ్ర స్థాయిలో కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు.

సడలని నిరసన

(మొదటిపేజీ తరువాయి)

కొలంబోలోని ప్రధానమంత్రి ఇంటికి నిప్పుపెట్టి అధ్యక్షుడి అధికారిక నివాసంపైకి దూసుకెళ్లారు. అఖిలపక్ష ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రధాని రణిల్ విక్రమ సింఘే కూడా రాజీనామాకు సిద్ధమని ఆయన కార్యాలయం శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపింది. బుధవారం తన పదవి నుంచి వైదొలగనున్నట్లు రాజపక్స తనకు తెలియజేసినట్లు స్పీకర్ మహింద యాపా అబేవర్ధన ఒక వీడియో ప్రకటనలో తెలిపారు. శాంతియుతంగా అధికారాన్ని అప్పగించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నారని, అందువల్ల చట్టాన్ని గౌరవించాలని, శాంతిభద్రతలు కాపాడాలని ప్రజలను కోరుతున్నానని అన్నారు. 22 మిలియన్ల జనాభా ఉన్న ఈ ద్వీప దేశంలో భయంకరమైన ఆర్థిక సంక్షోభం కారణంగా నెలరోజులపాటు శాంతియుతంగా జరిగిన ప్రభుత్వ వ్యతిరేక నిరసనల ఉధృతి తర్వాత ఈ ప్రకటన వెలువడింది. స్పీకర్ 30 రోజుల పాటు అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. ఆ సమయంలో పార్లమెంటు కొత్త నాయకుడిని ఎన్నుకుంటుంది.

అధ్యక్షుడి నివాసంలో కరెన్సీ కట్టలు

అధ్యక్షుడు రాజపక్స అధికారిక నివాసాన్ని ముట్టడించిన ప్రభుత్వ వ్యతిరేక నిరసనకారులు ఆయన భవనంలో కోట్ల విలువ చేసే కరెన్సీ కట్టలను స్వాధీనం చేసుకున్నట్లు ఆదివారం మీడియా నివేదిక పేర్కొంది. బయటపడ్డ కరెన్సీ నోట్లను ఆందోళనకారులు లెక్కిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. స్వాధీనం చేసుకున్న నగదును భద్రతా విభాగాలకు అందజేస్తామని నిరసనకారులు తెలిపారని డైలీ మిర్రర్ వార్తాపత్రిక నివేదించింది. సంబంధిత వాస్తవాలను పరిశీలించిన తర్వాత పరిస్థితిని ప్రకటించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలియజేసినట్లు ఆ పత్రిక పేర్కొంది.

ప్రతిపక్షాల సమావేశం

నూతన ప్రభుత్వ ఏర్పాటు కోసం ప్రతిపక్ష పార్టీలు ఆదివారం సమావేశమయ్యాయి. పార్లమెంటులో ఆధిక్యతను నిరూపించుకునేందుకు అవసరమైన 113 మంది ఎంపీల బలం ప్రతిపక్షాలకు ఉందని ప్రతిపక్ష ఎంపీ ఎంఏ సుమంతిరన్ చెప్పారు. నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే వరకు ఆగాలని, ప్రభుత్వ ఏర్పాటు తర్వాత మాత్రమే దేశాధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని గొటబాయ రాజపక్సను ప్రతిపక్ష సభ్యులు కోరతారని తెలిపారు.

శాంతియుత పరిష్కారానికి సహకరించండి: సైన్యాధిపతి

శాంతియుత పరిస్థితులు ఏర్పడటానికి ప్రజలు సహకరించాలని సైనికాధిపతి షవేంద్ర సిల్వ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత సంక్షోభాన్ని శాంతియుతంగా పరిష్కరించుకునే అవకాశం వచ్చిందని తెలిపారు. శాంతిభద్రతలు నెలకొనేలా సాయుధ బలగాలు, పోలీసులకు మద్దతు ఇవ్వాలని ప్రజలందరినీ అభ్యర్థించినట్లు కొలంబో గెజిట్ న్యూస్ పోర్టల్ నివేదించింది.

కబోర్డ్ వెనుక హై సెక్యూరిటీ బంకర్

గొటబాయ భవనాన్ని చుట్టుముట్టిన ఆందోళనకారులు భవనంలోని హై సెక్యూరిటీ బంకర్‌ను చూసి ఆశ్చర్యపోయారు. విలాసవంతమైన ఆయన నివాసంలో ఆందోళనకారులు కబోర్డులా ఉన్న ఒక తలుపు తెరిచి చూస్తే వెనక ఉన్న దారిలో విలాసవంతమైన హై సెక్యూరిటీ బంకర్ కనిపించింది. కొందరు ప్యాలెస్ ఆసాంతం క్షుణ్ణంగా పరిశీలించగా, మరికొందరు మంచాలపై కనిపించారు. ఇంకొందరు ప్యాలెస్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో దూకి ఈత కొట్టారు. మరికొందరు ఆయన గదిలో విశ్రాంతి తీసుకుంటూ కెమెరాలకు చిక్కారు. అలాగే అధ్యక్ష భవనంలోని ఖరీదైన కార్ల వద్దకు వెళ్లి అనేక మంది సెల్ఫీలు తీసుకున్నారు. తాజాగా ప్రధాని అధికారిక నివాసం (టెంపుల్ ట్రీ) లో కొందరు ఆందోళనకారులు హంగామా చేస్తూ కనిపించారు. ప్రధాని పడక గదిలోకి వెళ్లి అక్కడి మంచంపై ఫైట్ చేస్తూ కనిపించారు. కొందరు గార్డెన్‌లో తమ పిల్లలను కూర్చోబెట్టుకుని ఆహారం తినిపిస్తున్నారు.

ప్రధాని ఇంటికి నిప్పంటించిన ముగ్గురు అరెస్టు

శనివారం జరిగిన హింసాకాండలో విక్రమ సింఘే వ్యక్తిగత నివాసానికి నిప్పంటించినందుకు శ్రీలంక పోలీసులు ఆదివారం ముగ్గురిని అరెస్టు చేశారు. నిరసనకారులు కేంబ్రిడ్జ్ ప్లేస్‌లోని విక్రమ సింఘే ప్రైవేట్ నివాసంలోకి ప్రవేశించి దానికి నిప్పంటించారు. ఆస్తికి భారీ నష్టం కలిగించారు. అరెస్టయిన వారిలో 19 ఏళ్ల మౌంట్ లావినియా నివాసి, 24, 28 సంవత్సరాల వయస్సు గల ఇద్దరు గాలే నివాసితులు ఉన్నారని పోలీసు ప్రతినిధి తెలిపారు. మరిన్ని అరెస్టులు కొనసాగుతున్నాయని చెప్పారు.

శ్రీలంకలో తీవ్ర ఆర్థిక సంక్షోభం నెలకొంది. ఆ దేశం స్వాతంత్ర్యం పొందినప్పటి నుంచి ఇంతటి సంక్షోభాన్ని చూడలేదు. చమురు సహా ఇతర అత్యవసర సరుకులనూ దిగుమతి చేసుకోవడానికి ప్రభుత్వం దగ్గర విదేశీ మారకం లేదు. దీంతో ప్రజలు దిన దిన గండంగా బతుకుతున్నారు. ఈ నేపథ్యంలో శ్రీలంక ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్ర ఆందోళనలు చేస్తున్నారు.

విద్య, వైద్యం అందని ద్రాక్షేనా?

- నిర్లక్ష్యానికి గురవుతున్న గిరిజన ప్రాంతాలు
- మూతపడ్డ పరిశ్రమలు
- ఆగని వలసలు
- ఇదీ ఉత్తరాంధ్ర పరిస్థితి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం ప్రధానంగా వ్యవసాయ రంగంలోనే కనబడుతుంది. సాగు భూమి తక్కువగా ఉండడం, ఎక్కువ మంది ఆధారపడడం, చిన్న చిన్న కమతా లుండడం, సాగునీటి సౌకర్యాలు లేకపోవడం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు అమలు కాకపోవడం, తక్కువ ఉత్పాదకత వంటివి ఇక్కడి ప్రత్యేక అంశాలు. 1050 మి.మీ. సగటు వర్షపాతం, వంశధార, నాగావళి, జంఝావతి వంటి 16 నదులున్నాప్పటికి మొత్తం నీటిని వినియోగించుకునేలా వీటిపై నీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టకపోవడం వ్యవసాయానికి ప్రధాన అవరోధంగా మారింది. గతంలో కాంగ్రెస్, టీడీపీ, నేడు వైసీపీ ప్రభుత్వాలు ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులపై ఉద సీనంగా వ్యవహరిస్తున్నాయి. దీనివల్ల తీవ్రమైన గ్రామీణ పేదరికం, ఫలితంగా వలసలు పెరుగుతున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత కూడా ఈ పరిస్థితిలో మార్పులేదు. వైసీపీ మంత్రులు సామాజిక న్యాయభేరి యాత్ర పేరుతో తూతూ మంత్రంగా బస్సు యాత్ర చేపట్టినా ప్రయోజనం లేదని, ఉత్తరాంధ్రలో నీటి ప్రాజెక్టులు పూర్తిచేస్తే చాలనీ, రైతులు, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపినట్లే అవుతుందని ఉత్తరాంధ్ర వాసులు అంటున్నారు. దశాబ్దాలు గడుస్తున్నా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చక పోవడం ఉత్తరాంధ్ర జిల్లాల్లో తాగు, సాగునీరు లేకపోవడంతో వలసలు తప్పడంలేదు. దేశంలో ఏ మూలకు వెళ్లినా ఉత్తరాంధ్ర వాసులే వలస జీవులుగా వెళ్లి విగతజీవులుగా తిరిగి వస్తున్నారు. ఈ ప్రాంతంలో నిరుద్యోగం మరింత పట్టిపీడిస్తోంది. కొత్త పరిశ్రమలు రాకపోవడం, ఉన్న పరిశ్రమలు మూతపడటం ఉత్తరాంధ్రకు శాపంగా మారాయి. గరివిడి ఫేకర్ ఎల్లోస్, బొబ్బిలి, విజయనగరం, సాలూరు, నెల్లిమర్ల, చిట్టివలస జూట్ మిల్లులు మూతపడడంతో ఉపాధి లేక ఈ ప్రాంత ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లిపోతున్నారు. పాలకులు కాగితాల్లో ప్రచారం తప్ప ఉపాధి కల్పనలో ముందు ఉండడం లేదు. విద్య, వైద్యం అందని ద్రాక్షగా మారింది. పేద సామాన్య కుటుంబాలు విద్య, వైద్యం కొనుక్కునే పరిస్థితిలో లేకపో వడంతో మరింత వెనుక బాటుకు గురవుతున్నారు. ప్రకృతి సంపద, అపారమైన వనరులు ఉన్నప్పటికీ వలస రాజకీయ నాయకులు ఉత్తరాంధ్ర పై పెత్తనం చెలాయిస్తూ కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేస్తున్నారని ఉత్తరాంధ్ర మేధావులు అభిప్రాయపడుతున్నారు.

నిర్లక్ష్యానికి గురౌతున్న గిరిజన ప్రాంతాలు

రాష్ట్రంలోనే అత్యధిక గిరిజన ప్రాంతం ఉత్తరాం ధ్రలోనే ఉంది. జనాభా రీత్యా చూసినా రాష్ట్ర గిరిజన జనాభాలో 37.23 శాతంతో ఉత్తరాంధ్రలోనే అధికం. అల్లూరి సీతారామరాజు పాడేరు జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లా విస్తీర్ణంలో 42.30 శాతం ఫారెస్టు భూమి ఉంది. అల్లూరి జిల్లా జనాభాలో 14.42 శాతం గిరిజనులు ఉన్నారు. తర్వాత స్థానంలో విజయనగరంలో 10.05 శాతం, నాలుగోస్థానంలో 6.15 శాతంతో శ్రీకాకుళం ఉన్నాయి. దట్టమైన అడవులతో నిండిన ఈ ప్రాంతంలో అపారమైన అటవీ సంపద ప్రకృతి సిద్ధంగా పోగుపడి ఉంది. అయితే, విచిత్రంగా ఈ సంపద ఫలాలు గిరిజనులు పొందలేక పోతున్నారు. ఈ సంపద పక్కనే తీవ్రమైన పేదరికం, నిరక్షరాస్యత వంటివి నిలుస్తు న్నాయి. ఈ ప్రాంతంలోని సంపదను కొల్లగొట్టుకు పోవడానికి పాలకులు శత విధాలా ప్రయత్నిస్తున్నారే తప్ప, ఈ సంపదతో గిరిజనుల జీవన ప్రమాణాల మెరుగుదలకు కనీసం ప్రయత్నాలు చేయక పోవడం నేటి దుస్థితికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. నేటికీ గిరిజన ప్రాంతంలో డోలి మోతలు తప్పడం లేదు. విద్య, వైద్యం గిరిజన ప్రాంతంలో అందుబాటులో లేకపోవడంతో తీవ్ర వెనుకబాటుకు గురవుతున్నారు. నేటికీ వందలాది ఏజెన్సీ గ్రామాల్లో అంధకారం నెలకొంది. విద్యుత్ సరఫరా అనేక మారు మూల గిరిజన గ్రామాలకు అందకపోవడం అన్యా యంగా చెప్పవచ్చు. ఏటా సీజనల్ వ్యాధులకు వందలాది మంది గిరిజనులు మృత్యువాత పడుతున్నారు. ఏజెన్సీలో సగటు మనిషి జీవన కాలం 45 సంవత్సరాలు కావడం పౌష్టికాహార లోపం ఎంతగా ఉంటుందో గిరిజన ప్రాంతంలో మరణాల గణాంకాలు తెలియ జేస్తున్నాయి. ప్రభు త్వాలు మారినా, గిరిజనుల తలరాతలు మారడం లేదు. వారి బతుకుల్లో వెలుగులు రావడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ ఈయూ 71వ ఆవిర్భావ దినం నేడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) 71వ వ్యవస్థాపకదిన వేడుకలను సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైవీరావు, పలిశెట్టి దామోదరావు ఒక ప్రకటనలో తెలిపారు. 1952 జులై 11న రవాణా రంగంలో పనిచేసే కార్మికుల హక్కులకోసం ఆర్టీసీ ఏర్పడిందని వివరించారు. ఇవాళకు 70 ఏళ్లు పూర్తిచేసుకుని, 71లోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్వర్యంలో ఆవిర్భావదినోత్సవ వేడుకల్ని 26 జిల్లాలలోని 129 డిపోలు, నాలుగు వర్కుషాపులవద్ద ఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అన్ని డిపోల వద్ద ఆర్టీసీ-ఈయూ జెండావందనం చేస్తూ ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేస్తారనీ, రోగులకు పండ్లు,పేదలకు భోజనాల ఏర్పాటు చేయడంతోపాటు రక్తదాన శిబిరాలను నిర్వహిస్తారని తెలిపారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు జయప్రదం చేయాలని కోరారు.

'స్థానిక' నిధులు విడుదల చేయాలి

సీఎం జగన్‌కు సీపీఎం నేత మధు లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్థానిక సంస్థలకు తక్షణం నిధులు విడుదల చేయాలని, సీఎఫ్ఎంఎస్ (కాంప్రహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ సిస్టమ్) నుంచి స్థానిక సంస్థలను మినహాయించాలని సీపీఎం నేత, రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం జగన్‌కు ఆదివారం ఆయన ఒక లేఖ రాశారు. జగన్ ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా స్థానిక సంస్థలకు చెల్లించాల్సిన నిధులు చెల్లించకుండా తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. ప్రభుత్వం చట్ట విరుద్ధంగా వినియోగించు కుంటోందని, మూడేళ్లలో 14, 15వ ఆర్థిక సంఘాల నుంచి గ్రామ పంచాయితీలకు విడుదలైన రూ.7659కోట్లను దారి మళ్లించి ప్రభుత్వం వినియోగించుకుంటోందన్నారు. సీఎఫ్ఎంఎస్ స్థానిక సంస్థలకు శరాఘాతంగా మారిందన్నారు. ప్రభుత్వం క్రమం తప్పకుండా తన పరిధిలో రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయడం లేదని, ఏడేళ్లుగా రాష్ట్ర సంచిత నిధి నుంచి స్థానిక సంస్థలకు రావలసిన నిధులు బదిలీ కావడం లేదనీ, తలసరి నిధులు విడుదల చేయడం లేదన్నారు. గ్రామ పంచాయితీలు, పురపాలక సంఘాలు ఎక్కువ భాగాం కేంద్ర ఆర్థిక సంఘం, రాష్ట్ర ప్రభుత్వ నిధుల మీద ఆధారపడి పౌరసేవలను ప్రజలకు అందిస్తున్నాయని తెలిపారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుల నిధులు దాదాపు రూ.600కోట్ల పైన రాష్ట్రప్రభుత్వం బకాయి ఉందన్నారు. ఫలితంగా విశాఖ, కాకినాడ, తిరుపతి, అమరావతి నగరాల్లో నవ్యనగరాల క్రింద చేపట్టిన ప్రాజెక్టులు కొన్ని అర్ధంతరంగా అగిపోయాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసే చర్యలు ఉపసంహరించాలని, వెంటనే నిధులు, గ్రాంటులు, ప్రత్యేక నిధులు, తలసరి గ్రాంట్లు విడుదల చేయాలని ఆ లేఖలో మధు డిమాండ్ చేశారు.

అయ్యా... సీఎంగారూ.. మాకూ ఉద్యోగాలిప్పించండి

విశాలాంధ్ర- పార్వతీపురం: రాష్ట్రంలోని 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల తీపికబురుని ప్రకటించగా తమకు కూడా న్యాయంచేసి రోడ్డున పడ్డ వందలాది కుటుంబాలను ఆదుకోవాలని 1994, 1996 డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థులు మొర పెట్టుకుంటున్నారు. ఇటీవల రాష్ట్రంలోని సుమారు నాలుగువేల ఐదువందల మంది నిరుద్యోగులకు మినిమం టైం స్కేల్ ప్రకారం 1998లో డీఎస్సీలో అర్హతసాధించిన వారికి ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటనతో పాటు జీఓ విడుదలవల్ల వయసుమళ్లిన చాలా మందిలో ఆనందానికి అవధులు లేకుండా సంతోషం వ్యక్తం చేశారు. అటువంటి సమయంలో 1994,1996 జిల్లా సెలక్షన్ కమిటీ (డీఎస్సీ) ద్వారా అర్హత సాధించి, ఇంటర్వ్యూకు కూడా హాజరైన తమను కూడా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిగణలోకి తీసుకొని వారి తరహాలో మినిమం టైం స్కేల్ ప్రకారం నియామకానికి చర్యలు తీసుకోవాలని వారంతా విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుత వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కూడా పాదయాత్రలో కలిశామని, హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ సలహాదారు సజ్జలను పలుమార్లు కలవగా సానుకూలంగా స్పందించారన్నారు. ఇటీవల రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణను కూడా బొబ్బిలిలో కలిసి తమగోడును వినిపించగా తప్పకుండా ప్రభుత్వం దృష్టిలోకి తీసుకొని వెళ్తామని చెప్పారన్నారు. క్వాలిఫైడ్ అభ్యర్థులు రావాడ రామారావు, కందుల శ్రీనివాసరావు, చిన్నంనాయుడు, రమేష్, రామారావు, సీపీఐ పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి కోరంగి మన్మధ రావు, సహయ కార్యదర్శి జీవన్ పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు సీఎం బక్రీద్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదర సోదరీమణులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సీఎం ట్వీట్ చేస్తూ, 'త్యాగం, ప్రేమ, సహనం వంటి సద్గుణాల సందేశమే బక్రీద్' అని అన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం చివరికి ప్రాణ త్యాగానికి సిద్ధపడిన ఇబ్రహీమ్ జీవితం మనందరికీ ఆదర్శమని, మంచి కోసం, ధర్మ సంస్థాపన కోసం ఈరోజు త్యాగోత్సవం జరుపు కుంటున్న ముస్లిం సోదర సోదరీమణులందరికీ బక్రీద్ శుభాకాంక్షలు" అని జగన్ ట్వీట్ చేశారు.

సీపీఐ నేత రామకృష్ణ శుభాకాంక్షలు

ముస్లిం సోదరులకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఇబ్రహీమ్ సిద్ధాంతం అందరికీ ఆదర్శనీయమని తెలిపారు.

రాష్ట్రపతి అభ్యర్థి ముర్ము రాక రేపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ము ఈనెల 12వ తేదీ మంగళవారం రాష్ట్రానికి రానున్నారు. ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో భేటీ కానున్నారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు సీఎం జగన్ నివాసానికి వెళతారు. అక్కడ ఆయన ఇచ్చే తేనేటి విందు స్వీకరిస్తారు. రాష్ట్రపతి ఎన్నికల్లో ద్రౌపదీ ముర్ముకు మద్దతు వైసీపీ ప్రకటించిన విషయం విదితమే.

మోదీ, జగన్‌ను సాగనంపండి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల

విశాలాంధ్ర-గుంటూరు: ఎన్నికల వాగ్దానాలను విస్మరిస్తూ, అలవికాని హామీలను ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిలను ఇంటికి సాగనంపాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సీపీఐ గుంటూరు నగర 24వ మహాసభల సందర్భంగా రెండవ రోజు ప్రతినిధుల సభ కామ్రేడ్ మల్లెబోయిన పిచ్చయ్య హాలు(పోలేరమ్మ దేవస్థాన మండపం, చాకలి గుంట)లో ఆదివారం జరిగింది. అధ్యక్షవర్గంగా జి.సురేష్ బాబు, లక్ష్మీ, చినపోతుల విజయకుమార్ వ్యవహరించారు. దేశ, రాష్ట్ర రాజకీయాలు, సీపీఐ బలోపేతం తదితర అంశాలపై ముప్పాళ్ల సుదీర్ఘ ప్రసంగం చేశారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా రైతు రుణమాఫి, ఉపాధి హామీ పథకం, అటవీ భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులకు సంపూర్ణ హక్కు, సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ తప్పిదాల వలన 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. గుజరాత్‌లో మారణహోమం సృష్టించిన వ్యక్తి నేడు దేశ ప్రధాని అయ్యాడని అన్నారు. తాము అధికారంలోకి వస్తే రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని, సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తానని, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా అంటూ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రశ్నించే వారిపై దాడులు చేస్తున్నాయని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలను బెదిరించి లొంగదీసుకోవడం సరికాద న్నారు. కేసులకు భయపడి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మోదీకి దాసోహం చేస్తున్నారని అన్నారు.

ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు పక్కన జంగాల అజయ్‌కుమార్, కోట మాల్యాద్రి, సురేష్‌బాబు, లక్ష్మీ, చల్లా చినఆంజనేయులు, మల్లిఖార్జునరావు తదితరులు

పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని, నిత్యావసర వస్తువుల ధరలు అందుబాటులో ఉంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ, అవకాశ వాద రాజకీయాలను చేస్తున్న పార్టీలను ఎదుర్కొనేందుకు సీపీఐని మరింత బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. గుంటూరు నగరంలో సీపీఐకి గొప్ప చరిత్ర ఉందని, ఆ చరిత్రను పునరావృతం చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం కార్యదర్శి నివేదికను నగర కార్యదర్శి కోట మాల్యాద్రి ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, సీపీఐ నాయకులు చల్లా చిన ఆంజనేయులు, పీవీ మల్లిఖార్జున రావు, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి నాయకులు గని, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాల చైతన్య, ఎస్‌కే వలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్‌జీ, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థల్లో గుర్తింపు సంఘాలకు ఎన్నికలు జరపాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యుత్ సంస్థల్లో కార్మిక సంఘాలకు తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలను నిర్వహించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేశు డిమాండ్ చేశారు. ఆదివారం గొల్లపూడి జోశ్యభట్ల భవన్‌లో ఏఐటీయూసీ అనుబంధ ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఓబులేసు మాట్లాడుతూ, విద్యుత్ సంస్థలో 20 ఏళ్లకు పైగా పనిచేస్తున్న కార్మికుల బతుకులు చీకటిమయంగానే ఉన్నాయన్నారు. పూర్తి స్థాయి ఉద్యోగులు ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌గా మార్పు చేయాలన్న కార్మికుల కోరిక కలగానే మిగిలిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కింది స్థాయి సిబ్బంది చాలా సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. 30 ఏళ్లుగా కొన్ని సంఘాలకే యాజమాన్య గుర్తింపు ఇచ్చి వాటితోనే సమస్యలపై చర్చిస్తోందన్నారు. దీంతోనే కార్మికుల సమస్యలు మరింత జఠిలమవుతున్నాయని విమర్శించారు. ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నా శివయ్య మాట్లాడుతూ... విద్యుత్ యాజమాన్యం తమకు అనుకూలంగా ఉన్న సంఘాలకు సాధారణ బది లీల్లో మినహాయింపు ఇవ్వడం, ప్రశ్నించే సంఘాల నాయకులను కక్ష పూరితంగా బదిలీలు చేయడం వంటి చర్యలతో నియంత్రించేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తోందన్నారు. నిబంధల ప్రకారం అందరి బదిలీలు చేపట్టాలని డిమాండు చేశారు. కోర్టు బదిలీల విషయంతో కోర్టు ఆదేశాలను సైతం యాజమాన్యం పాటించడం లేదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి ఒకే యూనియన్-ఒకే సంస్థగా గుర్తించేందుకు తక్షణమే కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, లేకుంటే మిగిలిన పక్షాలను కలుపుకుని ఐక్య ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం తూర్పు ప్రాంత పంపిణీ సంస్థ కంపెనీ కార్యదర్శిగా ఎస్.శ్రీనివాస శేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమితి సభ్యులుగా వెంకన్న బాబు, సత్తిబాబు, సూర్యనారాయణ, లావురాజు, రవిశంకర్, రామకృష్ణ తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ ఎం.ఏసోబు, రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎస్.గురుబ్రహ్మం, ఎస్‌పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షులు పి.సురేశ్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఓబులేసు. పక్కన శివయ్య, శ్రీనివాస శేఖర్, ఏసోబు తదితరులు

ఉక్కుప్రైవేటీకరణను వ్యతిరేకిద్దాం

పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ పిలుపు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో సాగుతున్న ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమంలో కార్మికవర్గంతో పాటు విశాఖ ప్రజలంతా భాగస్వామ్యం కావాలని ఉద్యమ నేతలు పిలుపునిచ్చారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో గత 514లు రోజులుగా సాగుతున్న దీక్షల్లో ఆదివారం ఉక్కు పరి రక్షణ పోరాట కమిటీ చైర్మన్, ఉక్కు గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ పాల్గొని ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ రంగాన్ని మొత్తం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు తహ తహ లాడుతున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కు జోలికి వస్తే కార్మికులు, నిర్వాసితులు, రాష్ట్ర ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. దీక్షలు చేపట్టి ఆదివారం నాటికి 514 రోజులు గడుస్తున్నా కేంద్రం ప్రభుత్వంలో చలనం లేదని దుయ్యబట్టారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కొనుగోలు చేయాలని ఎవ్వరు వచ్చినా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. పోరాటాలు, ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన కర్మాగారాన్ని ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటు పరం కానివ్వమని తేల్చి చెప్పారు. పోరాట కమిటీ ప్రతినిధులు జె.రామ కృష్ణ, కె.పరంధామయ్య, శ్రీనివాస రాజు, నందికి తాతా రావు, నమ్మి రమణ, రాజు తదితరులు మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల ప్రాణత్యాగాలతో సాధించుకున్న ఉక్కు కర్మాగారాన్ని అమ్మితే చూస్తూ ఊరుకోమని కేంద్రాన్ని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్, పక్కన శ్రీరాంమూర్తి, శంకరరావు, గోవిందరావు.

కార్మికవర్గ రక్షణకు ఐక్య ఉద్యమాలు

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్

విశాలాంధ్ర-శ్రీకాకుళం అరసవల్లి : కార్మికవర్గ సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలపై ఐక్య ఉద్యమాలకు సిద్ధమవుతున్నట్టు ఉఏఐఈయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్ అర్ దాసరి క్రాంతి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలలో పని చేస్తున్న కార్మికులకు పనికి తగ్గ వేతనం లభించటం లేదని పేర్కొన్నారు. సమాన పనికి సమానం వేతనం ఇవ్వడం సంక్షేమం అనే విషయాన్ని పాలకులు మరచారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధ రాత్రి నుంచే మున్సిపల్ కార్మికలోకం సమ్మెకు దిగుతోందని పేర్కొన్నారు. వారి న్యామైన కోర్కెలను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందని స్పష్టం చేశారు. ఈ నెల 25 నుంచి భవన నిర్మాణ కార్మికులు కూడా ఉద్యమ బాట పట్టడానికి సిద్ధమైనట్టు తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులోని రూ. 2 వేల కోట్లను జగన్ ప్రభుత్వం మళ్లించిందని దుయ్యబట్టారు. అంగన్వాడీలను మోసం చేస్తోందని తెలిపారు. పక్కనున్న తెలంగాణలో రూ. 13 వేలు ఇస్తుంటే ఏపీలో రూ.10 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని పేర్కొన్నారు. మద్యాహ్న భోజన పథకం కార్మికులు, ఆశ కార్యకర్తలు కూడా అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారందరినీ శాశ్విత ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో ఉద్యమాలు తీవ్రతరం అవుతాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారిపై వేధింపులు మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు డోల శంకర రావు ఏఐటీయూసీ జిల్లా గౌరవ సలహా దారు చిక్కాల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలంక కల్లోలానికి కారకులెవరు?

శ్రీలంకలో కల్లోల పరిస్థితులు ఏర్పడి ఎప్పుడేమి జరుగుతుందో అంతుపట్టకుంది. శనివారం జరిగిన ప్రజాగ్రహ దృశ్యాలు చూస్తే పాలకులు ఎన్నో దుర్మార్గాలకు పాల్పడ్డారని భావించవలసి వస్తోంది. ఇది ప్రజల తిరుగుబాటే. 2022, ఏప్రిల్‌లో ఆనాటి ప్రధాని మహీంద రాజపక్స ప్రజల ఆగ్రహాన్ని భరించలేక రాజీనామా చేశారు. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయింది. మహీంద రాజపక్స ఇప్పుడు దేశం నుంచి పారిపోయాడనుకుంటున్న అధ్యక్షుడు గొటబయకు అన్నయ్య. వీరి కుటుంబం నుంచి 18మంది మంత్రులు, ఇతర పదవులు చేపట్టారు. వీరిది కుటుంబ పాలనే. కుటుంబం లో దాదాపు 40మంది కలిసి ఇష్టా రాజ్యంగా పాలన చేయడమే నేటి సంక్షోభానికి దారి తీసింది. ఇక ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు నుంచి తీసుకున్న అప్పుల్లో నామమాత్రం ప్రజలకోసం ఖర్చు చేసి తక్కిన వేల కోట్ల రూపాయలు స్వాయత్తం చేశారన్న తీవ్రమైన ఆరోపణ లున్నాయి. ప్రజలూ బలంగా విశ్వసించారు. అంటే అల్లకల్లోలానికి, ఆర్థిక సంక్షోభానికి, నిత్యావసర వస్తువు లు సైతం లభ్యంకాకపోవడానికి వీరే కారణమని రూఢీ అయిన తర్వాతనే ప్రధాని, అధ్యక్షుడి రాజీనామాకు డిమాండ్ చేస్తూ అనేక రోజుల పాటు నిరసన ప్రదర్శ నలు చేశారు. ప్రజల నిరసనాగ్రహం వల్ల గొటబయ తాను రాజీనామా చేయకుండా పార్లమెంట్‌లో ఒకేఒక్క స్థానం కలిగి ఉన్న పార్టీ నాయకుడు రణీల్ విక్రమ సింఘేను ప్రధానిగా నియమించాడు. అయినా పరిస్థితుల్లో మార్పులేదు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు మళ్లీ అప్పులివ్వడానికి తిరస్కరించాయి. ఆర్థిక సంక్షోభం వల్ల ఆహారం, మందులు ఇతర వస్తువుల కొరత ఏర్పడింది.

చైనా అప్పులిచ్చి కీలకమైన ఓడ రేవును నిర్మించి ఇచ్చింది. తిరిగి అప్పు చెల్లించని పరిస్థితుల్లో ఆ ఓడరేవును చైనాకే అప్పగించారు. సంక్షోభంలో ఉన్న లంకకు మళ్లీ అప్పులివ్వడానికి చైనా సుముఖంగా లేదు. లంకకు అన్ని విధాలుగా సహాయం చేయాల్సిందిగా ఐక్యరాజ్యసమితి విజ్ఞప్తి చేయడంతో మనదేశంతో సహా అతి తక్కువ దేశాలు కొంత సహాయం చేశాయి. అయినప్పటికీ కనీస అవసరాలు తీరే ఆహార వస్తువులు, వంటగ్యాస్, పెట్రోలు, డీజిల్ ఇంధనాల తీవ్ర కొరతను ప్రజలు ఎదుర్కొంటున్నారు. సామాన్య, మధ్యతరగతి జనం కొనుగోలు శక్తి దారుణంగా పడిపోయింది. ఇప్పుడిప్పుడే పరిస్థితులు చక్కబడే అవకాశాలు లేవనే భావించాలి. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికలకు డిమాండ్ చేశాయి. గొటబయ వైదొలగాలని కోరాయి. అయినప్పటికీ గొటబయ పదవిని వదలలేదు. ఆయనకు కావల్సిన సంపద, ఇతర ముఖ్యమైన పత్రాలను తీసుకుని విదేశాలకు పారిపోయాడన్న వార్తలను ప్రభుత్వం ధృవీకరించలేదు. ప్రజల ఒత్తిడికి తట్టుకోలేక ప్రధాని విక్రమసింఘే సైతం రాజీనామా చేశాడు. తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన స్పీకరు మహిందయాప మాట్లాడుతూ, ఈ నెల 13న గొటబయ రాజీనామా చేస్తారని చెప్పారు. బహుశా ఈ లోపు గొటబయ తనకు, తన కుటుంబానికి కావలసిన రక్షణ తదితర అన్ని ఏర్పాట్లు చేసుకోవచ్చు.

అసాధారణ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన లంకలో పరిస్థితులను ఎవరు చక్కదిద్దుతారు? రాజపక్స కుటుంబాన్ని ప్రజలు ఇక ఎంతమాత్రం విశ్వసించరు. విదేశీ మారకద్రవ్య నిల్వలు హరించుకుపోతున్న స్థితిలో నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసే స్థితిలో ప్రభుత్వం లేదు. అన్ని వస్తువుల ధరలు ఆకాశా న్నంటాయి. ఒక్క కాఫీ తాగాలంటే వందలు ఖర్చు చేయవలసి వస్తున్నదంటే పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో మనకు అర్థమవుతుంది. ప్రధాని ప్రైవేటు ఇంటిని దహనం చేశారు. ప్రజా సమూహాలను అదుపు చేయడానికి పోలీసులు ఇతర రక్షక దళాలు చేసిన లాఠీఛార్జి, రెండు పక్షాల మధ్య జరిగిన ఘర్షణలలో దాదాపు 40మంది గాయపడినట్టు తెలుస్తోంది. నిరసనకారులు దేశ అధ్యక్ష భవనంలోకి ప్రవేశించి తమ అధీనంలోకి తీసుకున్నట్టు వార్తలు అందాయి.

శుక్రవారమే గొటబయ నౌకా విభాగం షిప్ గజబహుమీద కొలంబో పోర్టుకు చేరుకొని అనంతరం విమానాశ్రయానికి వెళ్లారని బహుశా విమానంలో మరో దేశానికి పారిపోయి ఉండవచ్చునని న్యూస్‌ఫస్ట్ ఛానల్ వార్త అందించింది. అన్ని రాజకీయ పక్షాల సమావేశానికి పిలుపునిచ్చిన తర్వాత విక్రమ సింఘె రాజీనామా చేశాడు. దాదాపు రెండు దశాబ్దాలుగా కుటుంబ నియంతృత్వ పాలనలో అణచివేతకు గురైన ప్రజల కోపం చల్లారడానికి మరికొన్ని రోజులు పట్టవచ్చు. రాజపక్స సోదరులే లంకను దివాలా తీయించారు. మార్చి, ఏప్రిల్ నుంచే పతనం ప్రారంభమైంది. 2.2 కోట్ల జనాభాగల అందమైన

ద్వీపదేశం శ్రీలంక. పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి. కొవిడ్-19 మహమ్మారి కారణంగా యాత్రికుల రాక దాదాపుగా నిలిచిపోయింది. ఫలితంగా కోట్లాది రూపాయల ఆదాయం కోల్పోయింది. అలాగే సేంద్రియ ఎరువులతోనే సేద్యం చేయాలన్న ఆంక్షలు ఆహార ఉత్పత్తులను దెబ్బతీశాయి. ద్రవ్యోల్బణం అదుపు చేయడానికి సెంట్రల్ బ్యాంకు 20 ఏళ్లలో ఏనాడూ లేనంతగా వడ్డీరేట్లను పెంచింది. రూపాయి విలువ దాలరు 362 స్థాయికి దిగజారింది. శ్రీలంక సంక్షోభానికి నియంతృత్వ కుటుంబ పాలన, అధికార దుర్వినియోగం, కోట్లాది రూపాయలు మింగేయడం వంటి కారణాలున్నాయి. పరిస్థితులు చక్కబడకపోతే శ్రీలంక సైన్యం దేశాన్ని తన గుప్పిట పెట్టుకునే అవకాశం ఉండవచ్చు.

పార్లమెంట్‌కు ఎన్నికల జరపాలన్న యోచనలో స్పీకరు ఉన్నారు. ప్రశాంతంగా ఉండాలని ప్రజలను సైన్యం కోరడం విశేషమే. శ్రీలంక పరిణామాలు ఇరుగుపొరుగు దేశాలకు హెచ్చరిక అవుతుందా? ప్రజలు సైతం తమ పాలకుల దుర్మార్గాలను ప్రశ్నిస్తారా? అనేక దేశాలలో నియంతృత్వ పోకడలు బలంగా ఉన్నాయి. ప్రజలే అప్రమత్తులు కావాలి.

- టి.వి.సుబ్బయ్య

సమస్యల గుర్తింపులో వైసీపీ విఫలం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించడంలో వైసీపీ ప్లీనరీ వైఫల్యం చెందిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. ఆదివారం విజయవాడలోని సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో ఆయన పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఏ.గఫూర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. అధికార వైసీపీ రెండురోజులపాటు నిర్వహించిన ప్లీనరీలో ఏ మాత్రమూ ఆత్మపరిశీలన లేదని, స్వోత్కర్షతో ముగిశాయని అన్నారు. లక్షల మంది ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపలేదని విమర్శించారు. పోలవరం నిధుల ప్రస్తావన లేదనీ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించకుండా మిషన్ 2024, టార్గెట్ 175 అంటూ ఎన్నికల నగారా మోగించడం ప్రజలకు మేలు చేయబోదన్నారు. 40 రోజులుగా సీపీఎం ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా 400 మండలాలు, 70 పట్టణాలు, 1200 వార్డులు, 3500 గ్రామాల్లో ఐదు లక్షలకుపైగా కుటుంబాలను కలిసి నిర్వహించిన సర్వేలో వెలుగులోకి వచ్చిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. గఫూర్ మాట్లాడుతూ అధికార పార్టీ ప్లీనరీ అంటే రాష్ట్ర సమస్యలపై ఏం చర్చిస్తారు, కేంద్రాన్ని ఏం అడుగుతారు అని ప్రజలు ఎదురు చూస్తారని కానీ ప్లీనరీ మొత్తం ఆత్మస్తుతి పరనిందలా సాగిందని విమర్శించారు. దీనివల్ల ప్రజలకు ఏం ఉపయోగమని ప్రశ్నించారు.

సాహితి

గరిమెళ్ళ బహుముఖీన విశ్వరూపం

సన్నిధానం నరసింహశర్మ, 9292055531

వర్తమాన తరానికి మనం మన స్వాతంత్య్ర సమరయోధుల గురించి స్ఫూర్తిదాయకంగా తెలియపరచవలసినంత తెలియజేస్తున్నామా? అంటే లేదు అని నిస్సిగ్గుగా ఒప్పుకోవచ్చు. వివిధ పాఠ్య గ్రంథాలను చూస్తే కూడా ఇది అర్థమవుతుంది. స్వాతంత్య్ర సమరయోధుల గురించే కాదు, ఆ కాలం నాటి స్వాతంత్య్ర సమర సాహిత్య సృజనల గురించి ఆయా కవుల్లో ముఖ్యులైన వారి గురించీ- వారి ఉన్నత చరిత్రల గురించి ఈ తరానికి భవిష్యతరానికి తెలపవలసి బాధ్యత మనపై ఉంది.

ముఖ్యంగా తెలుగు ప్రాంతాల వారి గురించి విశదపరచడంలో. జాతీయ స్థాయిలో - స్థాన కల్పనల గురించి యోచించాలి. అలా యోచించేటప్పుడు వేళ్ల లెక్కింపులోనే గణించదగిన స్వాతంత్య్ర సమర ప్రబోధ కవి గరిమెళ్ళ సత్యనారాయణ. శ్రీకాకుళంజిల్లాలో నరసన్నపేట ప్రియాగ్రహారంలో 1893 జూలై 15న పుట్టి 1952 డిసెంబరు 18వ తేదీన చెన్నపట్టణంలో కీర్తిశేషులైన గరిమెళ్ళ 59 ఏళ్ళ జీవితప్రస్థానంలో సాధించినవి ఎన్నో! రచించినవి ఎన్నో!

గరిమెళ్ళ సత్యనారాయణ అనగానే తటీమని గుర్తుకువచ్చేది 'మా కొద్దీ తెల్లదొరతనమూ' అనే ప్రసిద్ధమైన పాట. ఆ పాట చిన్నది కాదు, పెద్దది. అంతా పాడుకోలేక కొంత భాగాన్ని పాడుతూ గుర్తు చేసుకుంటాం. ఆ పాట కీర్తితెరను ఒకసారి పక్కకు తొలగించి చూస్తే గరిమెళ్ళ విశ్వరూపాన్ని చూడగలం. సమకాలీన రాజకీయ ఆర్థిక పరిజ్ఞానమున్న వ్యాస రచయిత. కళలపై అవగాహన అధ్యయనాలతో తర్కించిన కళాశీలి. ప్రయోజనకర గ్రంథాలను ప్రచురించిన ప్రచురణ/ ప్రకాశకర్త. ఉన్నవాటిలోనే తిరుగాడక కొత్త తలంపులుగల ప్రయోగశీలి. పెద్ద, చిన్న అది చూడకుండా, స్వీయ స్పందనలకు అనుగుణంగా రచనలు చేసిన విమర్శకుడు. జాతీయ భావాగ్నులు ప్రజ్వలింపజేసే చలనశీల ఉద్యమరూపుడు.

నూనుగు మీసాల నూత్నయౌవనదశలోనే తానున్న ప్రియాగ్రహారంలో 'జ్ఞానోదయసమాజం' అనే పొత్తపుగుడిని స్థాపించిన గ్రంథాలయోద్యమ భాగస్వామి. ఇన్ని పార్శ్వాల ఉన్నతమూర్తిని అర్థం చేసుకోవాలంటే ఆయన రాసిన వందల పాటల- గ్రంథాలను, అనువాద గ్రంథాలను, ఆనందవాణి, కిన్నెర, ఆంధ్రపత్రిక, ఢంకా, అంకుశం, భారతి, ప్రబుద్ధాంధ్ర వంటి పత్రికల్లోని వివిధ అంశాల వ్యాసాలను పరిశీలించాలి. వ్లాడిమిర్ కిషన్, భోగరాజు పట్టాభి సీతారామయ్య వంటి గ్రంథాలను ఆయన చేసిన అనువాదాలు చదవాలి. లేదా చల్లా రాధాకృష్ణ, బి. కృష్ణకుమారి, పరకాల పట్టాభిరామారావు, డా.కె.ముత్యం వంటివారు రాసిన పరిశోధనాత్మక గ్రంథాలు, సంకలనాలు చదవాలి.

ఇప్పటికీ గ్రంథస్థ రూపం పొందని ఆయన వ్యాసాలు సంపుటాలుగా రావల్సి ఉండటం బాధాకరం. Heart of India అనే ఆయన ఆంగ్ల గ్రంథాన్ని ప్రీత్‌కుమారి అనే రచయిత్రి ఆచార్య జయధీర్ తిరుమలరావు ప్రోత్సాహంతో ప్రకాశింపజేశారు. రాజకీయ, ఆర్థిక, సాంస్కృతికరంగాలలో గరిమెళ్ళ అధ్యయనం ఆయన పత్రికావ్యాసాల్లో ప్రస్ఫుటమవుతుంది.

కమ్యూనిజం పట్ల మంచి అవగాహన ఉన్న వ్యక్తి. కలెక్టరాఫీసులో క్లర్కుగాను, విజయనగరంలో ఉపాధ్యాయునిగా గరిమెళ్ళ పనిచేశారు. బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసాలకు ఉత్తేజితుడైన గరిమెళ్ళ జాతీయభావాలు స్వాతంత్య్ర సమరభావాలు కలనేతగా నేతగా తయారయ్యాడు. రాజమండ్రిలో ఉపాధ్యాయుల బోధనాభ్యాసన కళాశాలను స్వాతంత్య్ర సమరాభినివేశంలో వదిలేశారు. గాంధీ ప్రబోధాలకు ప్రేరితుడై తెల్లదొరతనం తల్లడిల్లేలా 'మా కొద్దీ తెల్లదొరతనమూ' పాటను రాశారు. గాయకుడై గానం చేశారు. అలా ఆ పాట పాడుకుంటూ ప్రయాణించేవారు. 35 చరణాలను మించిన ఆ పెద్ద పాటకు సైక్లోస్టయిలు ప్రతులు తీసి పంచుకుంటూ వెళ్లేవారు. కారాగారవాస క్లేశాలకు ఆ పాట ప్రధానకారణమయింది. కారాగారంలో తమిళం నేర్చుకోవడమే కాదు. ఆ భాషలోని నీతి గ్రంథం తిరుక్కురళ్‌కు తెలుగు అనువాద గ్రంథం సంతరించిన తీక్షణదృష్టిగల రచయిత. 'సాహిత్యగాంధీ'గా ప్రజా ప్రశంసపొందిన భావోజ్జ్వలుడు. ప్రజాసాహిత్యంతో పెనవేసుకున్నా జంగం కథా ప్రక్రియలో 'ఆంధ్ర రాష్ట్రం' రాసిన రాష్ట్ర ప్రేమికుడు. దేశభక్తి గీతాగానం చేసిన గరిమెళ్ళను కర్కశమైన తెల్లదొరతనం రెండున్నర ఏళ్ళు జైల్లో మ్రగ్గజేసింది.

స్వాతంత్య్రసమర విప్లవగీతం 'మా కొద్దీ తెల్లదొరతనం'

రాజమహేంద్రిలో బ్యాండుమేళాలవారు ఆ పాటను పాడారంటే- ఒక వివాహ సందర్భంలో సైతం ఆ పాట పాడబడిందంటే - విజయనగరంలో మాలపేటలో రెల్లికులంవారు ఈ పాట పాడుకునే వారంటే దాని ప్రభావం ఆనాటి ప్రజల్లో ఎలా ఉందో తెలియడానికి కొన్ని సాక్ష్యాలు మాత్రమే.

ఆ పాటలో మాటల ఫిరంగిధ్వనులున్నాయి. మాటలే తూటాలై తెల్లవారిని భయపెట్టాయి. పాట-పఠనం ద్వారా భావాన్ని గ్రహించగలిగినా అది గానయోగ్యమైనపుడే దాని అందం, చందం. ఈ పాటలో భావుకత కూడా ఉంది కనకే -జైల్లో స్వేచ్ఛ అనే వధూమణి ఓ ప్రజలారా! మీకై వేచి చూస్తోంది. పుష్పగుచ్ఛాలనుధరించి మిమ్మల్ని అభినందించడానికి సంసిద్ధురాలైఉంది. విచ్చలవిడిగా హాయిగా రెక్కలువిప్పి జైల్లో విహరించవచ్చు. మాతృఋణాన్ని తీర్చుకోవడానికి జైళ్ళకు రండి అంటారీ పాటలో.

గరిమెళ్ళ వారు చివరిదశలో చెన్నపురిలో -సంపాదన లేక, మెరీనాబీచ్‌లో చేయిసాచి డబ్బు అడుక్కుని బ్రతికారట. ఎంత బాధాకరం. పరిశోధనా రచయిత డా.కె. ముత్యం బాధతో ఆ అడుక్కున్నది గరిమెళ్ళ రూపంలో 'తెలుగుజాతే' అని మన కళ్ళతడి పెంచారు. గరిమెళ్ళను ప్రజలలోకి ఇంకా తీసుకెళ్ళడానికి మనం కళ్ళు తెరవాలి. ఆయన బహుముఖ సేవలు బహిర్గతం కావాలి.

(జూలై 15న గరిమెళ్ళ సత్యనారాయణ 129వ జయంతి సందర్భంగా)

మాకొద్దీ తెల్ల దొరతనము!

('మా కొద్దీ తెల్లదొరతనం' పాట మనకు తెలిసింది కొద్దిగానే. ఇది పూర్తి పాట.)

మాకొద్దీ తెల్ల దొరతనము!
పల్లవి: మా కొద్దీ తెల్ల దొరతనము దేవ మా కొద్దీ తెల్ల దొరతనము
అనుపల్లవి: మా ప్రాణాలపై పొంచి - మానాలు హరియించె //మాకొద్దీ//

చరణములు:

పన్నెండు దేశాలు -పండుచున్నాగాని- పట్టెడన్నమె లోపమండి/
ఉప్పు! ముట్టుకుంటే దోషమండి! నోట - మట్టికొట్టి పోతాడండి!
అయ్యో! కుక్కలతో పోరాడి - కూడు తింటామండీ //మాకొద్దీ//
వర్తకంబునకొచ్చి - పట్టణంబుల పట్టి - రాజ్య మొక్కటి అల్లినాడు!
దాన్ని - రాణి కప్పగించినాడు! రాణి - పత్రమ్ము చించేసినాడు!
ఈ చిత్రమిదేమన్న - శిక్షిస్తానంటాడు //మాకొద్దీ//
కోర్టులంటూ పెట్టి - పార్టీలు పుట్టించి - స్నేహభావము చంపినాడు!
ద్రవ్య - దాహము కల్పించినాడు! చెడ్డ - యూహలు కదు పెంచినాడు
మా - ఆహారముల ద్రుంచి - ఆహా! యనిపించినాడు //మాకొద్దీ//
ప్రజల క్షేమంకోసం- పెట్టిన సంస్థలు - ప్రభులకోసం - మార్చేస్తాడు
వాటి - ప్రజల శత్రులు చేసుతాడు! మమ్ము - గజిబిజి లాడ చేస్తాడు
వాడి - గడబిడ వర్ణింప - కాదు బ్రహ్మ కైన //మాకొద్దీ//
నూటనలుబదినాల్గు - నోటికి తగిలించి - మాటలాడ వద్దంటాడు!
మమ్ము - పాట పాడ వద్దంటాడు! తనను - దాటి వెళ్ళవద్దంటాడు!
అయ్యో - చేటు తెచ్చుకొ మమ్ము - చెడిపోవమంటాడు //మాకొద్దీ//
ఘోర శాసనాలు - కూడదీసి మాదు - సారములెల్ల పీల్చాడు!
సంసారము లెల్ల కూల్చాడు! మా చీరలనెల్ల వొల్చాడు! బంగారములెల్ల దోచాడు!
వాడు - ధనవంతులనుబట్టి (త్రైతక్కలాడ్తాడు) దడదడలాడ్తాడు //మాకొద్దీ//
ధనముకోసం వాడు దారిచేసికొని - కల్లుసారా యమ్ముతాడు!
మాదు - ముల్లె మూటలు దోచినాడు! ఆలి - మెళ్లో పుస్తెలు త్రెంచినాడు!
మాదు - కళ్ళల్లొ దుమ్మేసి - కాటికి దరిచేస్తాడు //మాకొద్దీ//
పంటపోయిన గాని - పన్నులు విడువక - వెంట కరణాలంపుతాడు
వారి - వెంట తహశీల్దార్నంపుతాడు! లే కుంటే ఉద్యోగం తీస్తాడు!
మా ఇంటిలోపల యిట్లు - యిడుమల్లు పెడుతాడు //మాకొద్దీ//
ఏడాది కేడాది - కెక్కువ సిస్తేసి - ఈ భూమి నాదే నన్నాడు
మమ్ము కూలికి దున్నుమన్నాడు కడుపు మంటతో చావ మన్నాడు
అయ్యొ బానిసలకు వాడు - ప్రభువౌతనన్నాడు //మాకొద్దీ//
స్వరాజ్యమందిర - స్థాపితమైనట్టి - జండాలన్నియు పీకుతాడు
దేశం ముండా మొయ్యమంటాడు వాడు - బండతనము చూపుతాడు
ఈ ఛండాలపు వృత్తి - స్వీకరించెను నేడు //మాకొద్దీ//
దండు పట్టుకవచ్చి - తగుదునమ్మా యంచు దార్ల వెంబడి త్రిప్పుతాడు!
జాక్ జెండా మీది కెత్తుతాడు దానికి దండం పెట్టమంటాడు
వాడి గుండుబలం క్రింద - కూల రమ్మంటాడు //మాకొద్దీ//
కయ్యానికి ముందు - కాలు ద్రవ్వి వెనుక - దయ్యమై మము మ్రింగుతాడు
మాదు నెయ్యము చెడగొట్టుతాడు సేన కయ్యొ పాపము గట్టుతాడు
అయ్యొ వెయ్యేల! పోలీసు విధులు - మరిపిస్తాడు //మాకొద్దీ//
గాంధీటోపీ పెట్టి - పాఠశాలకు బోవ - రావద్దు రావద్దంటాడు!
రాట్నం బడిలో పెట్టవద్దంటాడు టోపీ తీసి వీపుల బాదుతాడు
వాడి రాజద్రోహమంత - రాట్నములో ఉన్నదట //మాకొద్దీ//
నూరుమంది మలబారు వాసులను - కూరినాడొక పెట్టెలోన!
నోట నీరు పోయడు, దేవు నాన! గాలి దూరనీయడించుకైన
వాడి దారుణత్వమెట్లు - తరిమివైతువా దేవ //మాకొద్దీ//
ప్రభువు గాంధితోడ - భారత దేశమాత - పరమ తపము చేసినాది!
ధర్మదేవత ప్రత్యక్షమైనాది! కోరిన వరము లిస్తానన్నాది!
ఆ దొరల గుండెలలోన - దడదడ పుట్టింది //మాకొద్దీ//
చూడియావుల కడుపు - వేడివేడి మాంసం - వాడికి బహు యిష్టమంట
మాదు పాడి పశువుల కోస్తాడంట! మా మతము పాడు చేస్తాడంట!
మా చూడి యావుల మంద - సురిగి, యింటికి రాదు //మాకొద్దీ//
చిత్తరంజన దాసు - చిన్నారు కొమరుని - చెయి విరచి చెర బెట్టినాడు
అతని పెత్తనంబును బట్టినాడు! వారి ముత్తైదువుల పట్టినాడు!
వాడి సొత్తుకు నిలమీద - చోటు లేదన్నాడు //మాకొద్దీ//
మా చీరాలను యిప్డు - చేరినాడు - చూచి సిగ్గును పొందబోడోయి!
ఇంక బీరాలు పలుకుతాడోయి! మాదు సారము గ్రహియింపడోయి!
వాడి దూరాలోచనమెల్ల - ధూళిలో కలిసింది //మాకొద్దీ//
వాడి తాతగారి ముల్లె దాచిపెట్టినయట్లు - ధాటీ చేస్తా డీ దేశమున!
పో రాడా మాడ్తాడాపైన, మో మోటము పడదు సుంతైనా
వాడి పాటుపాడై పోను - మాట చెపితే వినదు //మాకొద్దీ//
తెల్ల దొరల సేవ -వల్ల బ్రతుకుట పెద్ద నల్లని మచ్చని యెంచరోయి!
జాతి కల్లా తప్పని యెంచరోయి దైవ మొల్లడంచు తల్చరోయి
భూమి తల్లీ యేడ్పులు వినరోయి!
వారి యుల్లమెల్ల - సన్నికల్లులై పోయాయి! //మాకొద్దీ//
ఎవరి యనుమతిపైన - హిందూ దేశమునందు పరిపాలనము పెట్టినాడు?
వీడు ఎవరికీ జవాబు నీడు ధర్మ మార్గము నంటుకొని పోడు
వీడి దారుణత్వముకింక తగిన యీడే లేదు //మాకొద్దీ//
వాడి శాసనాలు - మాడిపోను, వాటి గోడియె మాకొద్దు తండ్రి!
ధర్మ దేవుడె మా రక్ష సుండి! ప్రజల ప్రేమయె మాకు దిక్కండి
కష్ట కాండమె మా పాలు సుండి
ఈ సృష్టి మమ్ము చూచి - సుందరమన నిండి //మాకొద్దీ//
దొరల బాధలు మాకు - తొలగించుమో తండ్రి నిరతము నిను గొల్తుమయ్య!
నీదు చరణధ్యానమె విడువమయ్య మేము మరువము మా ధర్మమయ్య
మేము ఐకమత్యముతోడ అలరారుతామయ్య //మాకొద్దీ//
గుండు పట్టుకొ మమ్ము - కూల్చ వచ్చినగాని - కూర్చున్న చోటుల విడము!
పాడుకొంటూ రాట్నం త్రిప్పుతాము రాజ్యసూత్రము వడి, వడుకుతాము!
దేవ శాంతిని తప్పము - సంతసం విడువము //మాకొద్దీ//
దేశభక్తుల నెల్ల దోషు లంచును పెద్ద - మోసగాండ్రని యెంచుతాడు
శాంతి నాశకులని పిలుచుతాడు దొంగలతో సరిగ మము చూచుతాడు!
వాడి పూసు యెట్టిదొ కాని - చూచి యోర్వలేడు //మాకొద్దీ//
బ్రాహ్మణా బ్రాహ్మణ - పంచమ బ్రాహ్మణ - భేదపు తెగలు మీకేల?
మీ భేదాలు వడి కాల్పరేల! చెడ్డ బోధలకు లొంగిరేల?
యీ మాధుకరపు వృత్తి - మరగినారది యేల? //మాకొద్దీ//
ఎవరెన్ని చెప్పిన హిందూదేశవాసు - లేక సోదరులె సుండీ
అంటూ దోషము మాకు లేదండీ పాపమంటూ చాటుదాము రండీ
ఈ కుంటి వాదనలు -గూటిలో పెట్టండి //మాకొద్దీ//
స్నాన ధ్యానము చేసి - రామ కృష్ణ యంచు - దేవుడి గుడిలోకి రండీ
అభి షేకమతనికి చేయండి నిర్మలత్వ మాత్మను పొందండి
ధర్మ మార్గమును తగిలి, మాలలూ రండి //మాకొద్దీ//
జయము నపజయమును - త్రాసులోపల పెట్టి -చక్కగ తూస్తామంటారు
ధర్మమె జయమని నమ్ముతారు దైవ నైజము గుర్తెరుగలేరు
పప్పు భోజనం కోసము -పుట్టామనుకొంటారు //మాకొద్దీ//
రాట్నలక్ష్మి నవ్వ - రంజిల్లు మోముతో -పాడుచున్నది నోటి నిండా
కరవు మాడుచున్నది దాని యెండా స్వేచ్ఛ తిరుగుచున్నది దానిగుండా
ఆ దొరల తేజంబెల్ల -తూల్చే జండా యుండా //మాకొద్దీ//
ఎన్ని జన్మములందు -ఏమి నేరము చేసి - కన్నుగానక తిరిగినామొ
ప్రజల అన్నమెల్లను క్రుమ్మినామొ దైత్యుల కన్న చెడ్డగ మెలగినామొ
నేడు దున్నలవలె నిట్లు - దొరకితిమి దొరలకు //మాకొద్దీ//
ప్రాపంచమెల్లను - పట్టి పిండేటంత పశుబలము వాడికుందంట
దాన వశ పరచుతాడు మమ్మంట మమ్ము కసిదీర కొట్టుతాడంట
వాడి శషభిషలెల్లను చెపుతాడు మా యింట //మాకొద్దీ//
స్వచ్ఛతేజముతోడ - స్వేచ్ఛావధూమణి - కారాగృహమున వేచియుంది
పూలగుచ్ఛములను దాల్చియుంది మీకు ముచ్చటలను తెల్పుతుంది
యీ చచ్చు రాజ్యము వీడి సరిగ జైలుకు రండి! //మాకొద్దీ//
విచ్చలవిడిగాను విప్పి రెక్కలు మీరు - విహరింపవచ్చు - మీరచట
స్వేచ్ఛ నిచ్చ నెక్కగ వచ్చు నచట దైవం మెప్పులందగవచ్చు నచట
తల్లి కచ్చియున్న ఋణము నర్పింపగా వచ్చు //మాకొద్దీ//
సకల దేశములార - సత్యవర్తనతోడ సారించు డిటుల మీ దృష్టి
యింక కనుడి హైందవ పుష్టి వేగ తెరవు దొరకుట క్రొత్త సృష్టి
ఎట్టి దండన లెదురైన -కాదు మాకు నష్టి //మాకొద్దీ//
ధర్మపక్షము నేడు - దారుణమైనట్టి బడలిక పాలయ్యె నయ్య
దాని వదలించుకొనలేదయ్య నీదు పదునగు ధారనీవయ్య
నీదు పదములపై వ్రాలి - ప్రార్థించినామయ్య //మాకొద్దీ//
ప్రపంచమున శాంతి - ప్రేమ దీపంబులు వెలిగించె నీ దేశమంత
గాంధి తెనిగించె నీ క్రొత్త వ్రాత స్వేచ్ఛ మొలిపించె మన శక్తి చేత
బలము దుర్బలమను - భేదమెచ్చట లేదు //మాకొద్దీ//
మా పాపమునెల్ల బాపి రక్షించుమా - పాపనాశన! ధర్మమూర్తీ
యిటుల కోపముంచకు - న్యాయమూర్తీ ఆపదల బాపుమో చక్రవర్తీ
నీ వ్యాపారమొకసారి - నెరపుము పృథ్విపై //మాకొద్దీ//
దీనుల పాలిటి - తేజమవీవని - వీనులారగ నేను వింటి
కోటి దీనుల మా భూమికంటె మము సమాన యుగముగ చూడుమంటి
మా ప్రాణాలైన నోర్చి - మాన మిమ్మంటిమి //మాకొద్దీ తెల్లదొరతనము//

జయంతి తే సుకృతినో రస సిద్ధాః కవీశ్వరాః

గ్రంథ సమీక్ష

"....నాస్తి యేషాం యశఃకాయే జరా మరణజం భయమ్" అన్నాడట భర్తృహరి తన 'నీతిశతకం'లో. 'రససిద్ధులైన కవీశ్వరులు కలకాలం మాన్యులుగా నిల్చిపోతారు; ముసలితనంవల్ల, మృత్యువువల్ల సంక్రమించే భయాలు ఈ యశఃకాయులకు వుండ'వన్నదే సుభాషిత కర్త భావన. ఇది కేవలం కవీశ్వరులకే పరిమితమయ్యే సుభాషితం కాదు; రససిద్ధమైన రచనలేవి చేసినవాళ్ళకైనా వర్తించే 'మంచిమాటే' ఇది. ఆ రకంగా ఇది ఇప్పుడు యశఃకాయులుగా మనమధ్య వున్న చక్రవర్తుల రాఘవాచారి(సి.రా.) గారికీ అంతగానూ వర్తిస్తుందన్నమాట! రాఘవాచారిగారికి ఈ సుభాషితమంటే ప్రత్యేకమైన అభిమానమేదో వున్నట్టుంది. అందుకే, ఆయన దాన్ని చాలా సంపాదకీయాల్లో వాడుక చేశారు. అది మనసులో పెట్టుకునే ఇదే సుభాషితాన్ని ఈ సమీక్ష వ్యాసానికి తలకట్టుగా వుంచాను!

ఉన్నతశ్రేణి తెలుగు మేధావుల్లో -అక్కడక్కడ- కనిపించే కొన్ని విశిష్టతలు సి.రా.లో పుష్కలంగా కనిపిస్తాయి. తెలుగునాట ఏదో ఒక ప్రాంతానికే పరిమితం కాని సంస్కారం ఆయనది. పుట్టింది ఉత్తర తెలంగాణలో; బాల్యంనుంచీ కోస్తాజిల్లాలతో ఆయనకి సన్నిహిత సంబంధ బాంధవ్యాలున్నాయి. ఆమాటకొస్తే, తెలుగునాట అన్నిప్రాంతాలతోనూ ఘనిష్టమైన సంసర్గ ఉందాయనకు. ఇక్కడి సామాజిక పరిణామాలపై ప్రత్యేకమైన అభిమానం, మన సాహిత్యంపట్ల ప్రగాఢమయిన అభినివేశం ఉన్నవారు సి.రా. ఇక, తెలుగు ప్రజల జీవన విధానంతో ఆయనకు వున్నంత చనుమానం అక్షరాలా అనుపమానం! తెలుగు పలుకుబడిపై సి.రా.కున్న పట్టు కేవలం అనన్యదృశ్యం! భారతీయ తత్వశాస్త్రం, సంస్కృత సాహిత్యం, సంప్రదాయ సంగీతం, తెలుగు కవిత్వం, నాటకం-సినిమా, సమకాలీన ఆలోచన ధోరణులూ, న్యాయ వైజ్ఞానికరంగాలపైనా రాఘవాచారి గారికి వున్నంత పట్టు, ప్రవేశం వున్నవాళ్ళను లెక్కించడానికి ఒక చేతివేళ్ళే ఎక్కువేమో! ఇన్ని లక్షణాలున్నవాళ్ళు వేరే రంగాల్లో వున్నారో లేదో కానీ, పత్రికలరంగంలో -మరీ ముఖ్యంగా మన తెలుగు పత్రికల రంగంలో- కచ్చితంగా మరెవ్వరూ లేరు! అలాంటి అసాధారణ మేధావి దాదాపు మూడు దశాబ్దాల కాలం ఒకే పత్రికలో వేర్వేరు విషయాలపై రాసిన సంపాదకీయాలు చదువుతూ పెరిగి పెద్దయిన తరానికి చెందినవాళ్ళం మేము. సి.రా. సంపాదకీయాల సంపుటాలు రెండు-రెండు వందలకు మించిన ఖండికలతో కూడినవి- చూసినప్పుడు నాలాంటివాడికి సహజంగానే సంబరంగానే అనిపిస్తుంది మరి.

మొదటి సంపుటికి ముందుమాట రాసిన ఇప్పటి 'విశాలాంధ్ర' సంపాదకులు ఆర్వీరామారావ్ చెప్పినట్లు ఈ తరం పాఠకులకు కందుకూరి, గురజాడ, గిడుగు, కొమర్రాజు, గరిమెళ్ళ, అడివి, చంద్రం, తుమ్మల, పుట్టపర్తి, బలరామమూర్తి, విద్వాన్ విశ్వం తదితరుల పేర్లు ప్రత్యేకించి గుర్తు చెయ్యవలసివస్తోంది. ఇతర రంగాల పరిస్థితి ఇంతకన్నా గొప్పగా లేదు; అందుకేనేమో రాజకీయ రంగంలో ప్రాతఃస్మరణీయులయిన కొమ్మారెడ్డి సత్యనారాయణ, కంభంపాటి (సీనియర్), పుచ్చలపల్లి, చండ్ర, నీలం, వావిలాలలాంటివారికి తన సంపాదకీయాల్లో అంజలి ఘటించారు సి.రా. వినోబా, మొరార్జీ, జయప్రకాశ్ నారాయణ్, వి.వి.గిరి, కృష్ణయ్యర్, మధు లిమాయే తదితరులను సందర్భోచితంగా ప్రస్తావించిన సి.రా. సంపాదకీయాలను ఈ తరం పాఠ్య ప్రణాళికలో చేర్చడం -జాతికి- మంచిది! కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, ఆరుద్ర, అనిసెట్టి, దాశరథి, సి.నా.రె. తదితరులు సినిమాపాటల రచయితలుగానే ఈతరానికి తెలుసేమో అనిపిస్తుంది! 1952 సార్వత్రిక ఎన్నికల్లో విజయవాడ లోక్‌సభకు ఎన్నికైన హరీన్ ఛట్టో, ఆయనకు 'అక్షరాలా' అక్కగారైన సరోజినీ నాయుడు, హరీన్ మేనల్లుడు - గొప్ప వైద్యుడు జయసూర్య, "విశ్వకవి" రవీంద్రనాథ్ టాగూర్‌నే మెప్పించగల్గిన మహాకవి- కార్మిక నాయకుడు - కమ్యూనిస్టు యోధ మఖ్దూమ్‌ల పేర్లను ఈతరం పాఠకులు విని వుండక పోతే, ఆ నేరం కచ్చితంగా తెలుగు పత్రికల సంపాదకులదే! అయితే, ఈ నేరారోపణకు అపవాదంగా నిలిచిన అరుదైన సంపాదకులు సి.రాఘవాచారి. తెలుగునాట అనేకమంది సంపాదకులకు అభిమాన సంపాదకుడుగా దశాబ్దాల తరబడి మెప్పించగలిగిన వ్యక్తి సి.రా. ఎప్పుడూ, ఏ రంగంలోనూ, ఏ ఒక్కరికీ అప్పనంగా గుర్తింపు వచ్చిపడదని మనం గ్రహించాలి!! హడావిడిగా నమోదు చేసే చరిత్రగా పత్రికా రచనను అభివర్ణించాడట మాథ్యూ ఆర్నాల్డ్. హడావిడిగా చేసినా, నిదానంగా చేసినా పత్రికల్లో రాయడమనేది చరిత్ర రచనేనన్న స్పృహ మరెవరికీ లేకపోయినా పర్వాలేదు కానీ, సంపాదక మహాశయుడికి వుండి తీరాలి! లేనట్లయితే, జాతి మెదడు పొరల మధ్యన మరుగున పడిపోయే ప్రమాదంవున్న మహనీయుల పేర్లనూ, వాళ్ళ కృషినీ తరచు పాఠకులకు గుర్తు చెయ్యాలనే బాధ్యత స్ఫురించకపోవచ్చును. అలాగే, ప్రతి సంఘటననూ స్థలకాలాల పరిధిలో పెట్టి చూడకపోతే, దాని చారిత్రక స్వరూపస్వభావాలు మనకు బోధపడకపోవచ్చుననీ అనిపించకపోవచ్చు.



రాఘవాచారి సంపాదకీయాల్లో కొట్టొచ్చినట్లు కనబడే లక్షణం ఒకటుంది. అది ఆయన శైలీవిన్యాసం! మంచివక్త కావడంచేత, తెలుగు-ఉర్దూ-సంస్కృతం-ఇంగ్లిష్ భాషల్లో లోతయిన ప్రవేశం వున్న రచయిత కావడం చేత, అన్నిటికీ మించి విద్యార్థి దశ నుంచీ ప్రధానమయిన పత్రికలన్నీ చదివే అభ్యాసమున్న ఉత్తమశ్రేణి పాఠకుడు కావడంచేత సి.రా. అలా మేలిరకం సంపాదకీయాలు సృజించగలిగారు. ఆలంకారిక ప్రయోగాలను పూర్తిగా అనూహ్యమయిన సందర్భాల్లో ప్రకటించడం ద్వారా సంపాదకీయానికి ఓ అసాధారణమైన అర్థగౌరవాన్ని ఆపాదిస్తారు సి.రా. ఒక ఉదాహరణ చూడండి ఎన్.టి.రామారావు మృతి సందర్భంగా రాసిన ఓ సంపాదకీయంలో 'కుమార సంభవం' లో కాళిదాసు ప్రయోగం ఒకటి ఉట్టంకించారు సి.రా. హిమాలయాల పైన నిరంతరం వుండే చల్లదనంపై కాళిదాసు చేసిన వ్యాఖ్య ఇది'ఏకోహి దోషో గుణ సన్నిపాతే-నిమజ్జతీందోః కిరణోష్వివాంకః'. ('అనేకగుణాల మధ్యన ఒక దోషం, చంద్రునికాంతిలో మరుగునపడే కళంకం మాదిరిగా కరిగిపోతుంది" అంటున్నాడు కాళిదాసు.) దీన్ని అర్థాంతరన్యాసం అనే అలంకారానికి మచ్చుగా సంస్కృత పఠనపాఠనాల్లో చెప్తుంటారు. దాన్ని తీసుకొచ్చి ఎన్టీఆర్ కుటుంబజీవనం తాలూకు చివరిరోజుల విపరీత ప్రవర్తనతో పోల్చారు సి.రా. ఈ పోలికతో 'ఉపమా రాఘవాచార్యస్య' అనిపించారు! ('తెలుగుతేజం' నిద్రపోయింది-రెండోసంపుటి పేజీ 238). నిజమైన విశేషం ఎక్కడుందంటే, 'విశాలాంధ్ర' పాఠకులకోసం ఇటువంటి సంక్లిష్టమయిన ప్రయోగాలు చెయ్యడానికి రాఘవాచారి ఏ మాత్రం వెనకాడకపోవడంలో వుంది! పిల్లల ఎదుగుదల కోసం వ్యాయామశాలల్లో ఏర్పాటుచేసే నిచ్చెనమెట్లను ఎప్పటికప్పుడు రీ-ఎరేంజ్ చేస్తుంటారట. అలా చెయ్యకపోతే వాళ్ళ ఎదుగుదల వేగంగా జరగదట! పత్రిక పాఠకుల సాంస్కృతికస్థాయిని కూడా అలాగే సంపాదకుడు ఎప్పటికప్పుడు రీఎరేంజ్ చేస్తూండాలి. అందుకు, చిన్ననాట నేర్చుకున్న సంస్కృత సాహిత్యాన్ని వినియోగించడం సి.రా. విశిష్టతను నిరూపిస్తోంది.

సమాచార సాధనంగా పత్రికను దిద్ది తీర్చే క్రమంలో, సందర్భోచితమయిన సంపాదకీయాలు రాయడమో, రాయించడమో ఎడిటర్ బాధ్యతల్లో కీలకమయిందనే మాట వాస్తవమే. మన దేశజనాభాలో అది కూడా పన్నెండేళ్ళకు మించినవారిలో దాదాపు 40శాతం మంది అచ్చయిన వార్తా పత్రికలు చూస్తున్నారని ఓ సర్వే చెప్తోంది. వారిలో సగానికి సగంమంది గ్రామీణ, చిన్నపట్టణ ప్రాంతాలకు చెందినవారేనట. ఈ వర్గానికి చెందిన పాఠకులు దాదాపు అందరూ ప్రాంతీయభాషల్లో అచ్చయ్యే పత్రికల పాఠకులు కాగా, వాళ్లలో ఏడు శాతం మాత్రమే సంపాదకీయం చదువుతారట. అంటే మొత్తం పత్రికల పాఠకుల్లో మూడున్నరశాతం మాత్రమే చదివే సంపాదకీయాలకు ఎందుకీ ప్రాధాన్యం? ఎందుకంటే, అది ఆయా పత్రికల విధానప్రకటన లాంటిది కనక! అంతేకాదు తెలుగుతో సహా భారతీయ పత్రికారంగం పాటించేది బ్రిటిష్ పత్రికారంగ సంప్రదాయాలనే. ఆయా ప్రజాస్వామ్య సమాజాల్లో అభిప్రాయాలను గాఢంగా ప్రభావితం చేసే సాధనాల్లో పత్రికల సంపాదకీయాలు ముఖ్యమయినవి. మతాలూ కులాలూ ప్రాంతాల మధ్య చిచ్చు రగిలినప్పుడు, ఒక పక్షాన్ని భుజాన వేసుకోకుండా, అన్ని పక్షాలమధ్య ఏకాభిప్రాయం సాధించగలిగే సాధనాల్లో సంపాదకీయాలు ముఖ్యమయినవి. ఈ కారణం చేతనే మంచి సంపాదకీయం ఎప్పుడూ తూకం తప్పకుండా నిదానంగా సాగిపోతుంది. ఈ మూడు లక్షణాలూ రాఘవాచారి లీడర్స్‌లో కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి.

ఇక్కడ ఓ చిన్న వివరణ అవసరం- జర్నలిజానికి సంబంధించిన మరో వివరంకూడా ఇక్కడే చెప్పుకోకపోతే, విశాలాంధ్రకు రాఘవాచారి చేసిన సేవను తగ్గించి చెప్పినట్లవుతుంది. సంపాదకీయాలు అనే సంపాదక వ్యాఖ్యలు, ఎడిటరే రాయాలన్న నిబంధన ఎక్కడా లేదు. పత్రిక సిబ్బందిలో మరెవరూ సంపాదకీయం రాయకూడదనే నిషేధమూ లేదు! పత్రిక ఏ ఆలోచన ధోరణికి కట్టుబడి వున్నదో దానికి ప్రాతినిధ్యం వహించగల అనుభవజ్ఞుడూ, ప్రతిభావంతుడూ ఈ బాధ్యత తీసుకోవడం తరచు జరుగుతూవుంటుంది. ఈ పాత్రకు రాఘవాచారి చేసినంత న్యాయం ఇతరులెవరూ చెయ్యలేదంటే అతిశయోక్తి కాదు. ఇందుకు దారితీసిన కొన్ని వ్యక్తిగత కారణాలుకూడా వున్నాయి. రాఘవాచారి ప్రత్యేకంగా అధ్యయనం చేసిన న్యాయశాస్త్రవిభాగం జ్యూరిస్‌ప్రుడెన్స్. ప్రాచీన భారతీయులు దీన్ని 'ధర్మశాస్త్రం'గా భావించారు. న్యాయశాస్త్ర తాత్వికతను విశ్లేషించి అధ్యయనం చేసే సైద్ధాంతిక విభాగమే జ్యూరిస్‌ప్రుడెన్స్. ఈ విభాగంలో రాణించడానికి న్యాయశాస్త్రం ఒక్కదానిలోనే ప్రావీణ్యముంటే సరిపోదు- తత్వశాస్త్రంలోనూ తగినంత అభినివేశం వుండితీరాలి! క్రీస్తుకు పూర్వం 1500ఏళ్ళనాటి రుగ్వేద ఆర్యులు, క్రీ.పూ. 800ఏళ్ళనాటి బోధాయనుడు, అతనికి 300ఏళ్ళ తర్వాతి కాలంవాడయిన సోక్రటీస్, తదితరులు ధర్మశాస్త్రం గురించి చెప్పినవాళ్ళే. అటువంటి తత్వవేత్తల, ధార్మికుల ప్రబోధాలను అధ్యయనం చేసే వారికి ఆలోచనలోనూ, భావప్రకటనలోనూ సమతూకం ఏర్పడుతుంది. దానికి మార్క్సిజంలాంటి ఆధునిక, సమకాలీన చైతన్యమూ తోడయితే రాఘవాచారిలాంటి సంపాదకీయ రచయిత రూపుదిద్దుకుంటాడు.

ఇంతకుముందు, రాఘవాచారి సంపాదకీయాల సంపుటులు చూసినప్పుడు నాకు కలిగిన సంబరం గురించి చెప్పాను. అయితే, సమీక్షకుల కళ్ళకు ఏ సంబరాలూ, సంభ్రమాల పొరలు కమ్మేయకూడదంటారు పెద్దలు. అందుకే, ఈ ఖండికల్లో నాకు బొత్తిగా కిట్టని అంశం ఒక్కదాన్ని గురించి మాత్రమే చెప్తున్నాను. రాఘవాచారి సంపాదకీయాల రెండో సంపుటి "నివాళి", 262వ పేజీలో "మంచి కమ్యూనిస్టు'కో మచ్చు" అనే సంపాదకీయం గురించి ప్రస్తావించకుండా వుండలేకపోతున్నాను. ఇది, దాదాపు దశాబ్దంనర కాలం చైనా అధినేతగా కొనసాగిన డెంగ్ షియావో పింగ్‌కు సమర్పించిన శ్రద్ధాంజలి. 1949నుంచి 78 వరకూ చైనాలో కొనసాగిన నకిలీ సోషలిజం స్థానంలో మార్కెట్ ఆర్థికవ్యవస్థను రాజ్యాంగబద్ధంగా ప్రవేశపెట్టి, చైనాలోనూ బయటా కూడా 'ఆధునిక చైనా నిర్మాత'గా ఆరతులందుకున్నవాడు డెంగ్. మావో అధినాయకత్వంలోని చైనా కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శిగానూ, ఆ దేశానికి ఉపప్రధాని గానూ పనిచేసిన డెంగ్‌కు 'సాంస్కృతిక విప్లవం' చీకటి రోజుల్లో -పదేళ్ళపాటు- గ్రహణం పట్టించారు. కానీ, మావో మరణానంతరం డెంగ్ నాయకత్వానికి ఎగబాకి ప్రతీకారం తీర్చుకున్నారు. పాతకాలపు రాచరికాల్లో జరిగాయని చెప్పే కుట్రలూకుహకాలను తలదన్నేరీతిలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 'డెంగ్ అభివృద్ధి పథం' వికృతరూపం వర్తమాన చరిత్ర తెలిసినవారందరికీ తెలిసిందే! ఏ దేశంలోనూ లేని రీతిలో చైనాలో మాత్రమే లక్షలాది స్వెట్ షాపుల్లో కార్మిక స్త్రీలతో రేబవళ్ళు పనిచేయిస్తున్నారని మీడియావర్గాలు గొంతు చించుకుని చెప్తున్నాయి. డెంగ్ అభివృద్ధి పథంలో భాగంగా జరిగిందే ఈ పరిణామం! ఇటువంటి అభివృద్ధిపథాన్ని కనిపెట్టి, ప్రపంచంలోని అత్యధిక జనసంఖ్య కలిగిన దేశం నెత్తిన రుద్దినవాడు "మంచి కమ్యూనిస్టు'కో మచ్చు" ఎలా కాగలడన్నదే అంతుపట్టని విషయం. పైగా సోషలిస్టు వ్యవస్థ పునాదులు చైనాలో బలంగా వున్నాయనీ, పెట్టుబడిదారీ దోపిడికి అక్కడ తలుపులు బార్లా తెరవలేదనీ వ్యాఖ్యానించడం మరీ విడ్డూరంగా వుంది. అసలు 'డెంగ్ అభివృద్ధి పథం' లక్ష్యమే ఈ రెండు విషయాలకూ రాజ్యాంగ బద్ధత కల్పించడం! 1997-1999 సంవత్సరాల్లో జనచైనా రిపబ్లిక్కులో భాగమైన హాంకాంగ్, మకావు ప్రాంతాల్లో "ప్రత్యేక పాలనవ్యవస్థలు" ప్రవేశపెట్టింది ఈ మంచి కమ్యూనిస్టే! దీనికి డెంగ్ పెట్టిన ముద్దుపేరు "ఒక దేశం-రెండు వ్యవస్థలు!" అయితే, ఇటువంటివి ఈ సంపుటులలో ఒకటిరెండు కన్నా కనిపించకపోవడం చూస్తే, మళ్లీ కాళిదాసు చెప్పిన అర్థాంతరన్యాసాన్ని గుర్తు చేసుకోవాలనిపిస్తుంది.

సంపాదకీయ రచనను ఒక కళారూపంగా సాధన చేసిన చక్రవర్తుల రాఘవాచారి గారికి 'విశాలాంధ్ర' పాఠకకోటి తరఫున నమస్సులు!!

మందలపర్తి కిషోర్, 8179691822

తెలుగులో కొత్త కవుల సృష్టి జరగడం లేదా..?!!

'కవిత్వం చదివేవాళ్ళు ఈకాలంలో ఉన్నారా? ఉంటే ఏవిధమైన కవిత్వం చదువుతున్నారు! తెలుగు సాహిత్య రంగంలో కొత్త కవులు పుట్టుకొస్తున్నారా? ఏ సాహిత్య సభలకి వెళ్ళినా తల పండిన ముసలివాళ్లే, కాని పట్టుమని రెండు పదులు వయస్సున్న యువ కవిత్వం పుట్టుకురావడం లేదు...' ఇవీ ఈనాడు చాలచోట్ల సాహిత్యకారుల్లో వినవస్తున్న మాటలు. కవిత్వం చదివేవాళ్లు లేకపోతే, కొత్తగా కవిత్వం రాసేవాళ్లు లేకపోతే మరి ఫేస్ బుక్, వాట్సాప్ వంటి సోషల్ మీడియాల్లో పుంఖాను పుంఖాలుగా కవిత్వం ఎలా పుట్టుకొస్తోంది? ఈ కవిత్వం రాసేవాళ్ళు కూడా కేవలం కొత్తవాళ్ళే గాని సీనియర్‌కవులు ఎంతమాత్రంకాదు. రాసేవాళ్ళు కూడా రెండు, మూడు, నాలుగు పదుల వయస్సుగలవాళ్ళే ఎక్కువగా కనిపిస్తున్నారు. అందులో మహిళలు, గృహిణులు, ఉద్యోగస్థులు అనేకమంది కొత్తగా కానవస్తున్నారు. వీళ్ళంతా ఎక్కడ, ఎలా పుట్టుకొచ్చారు. కవిత్వం చదివేవాళ్లే లేరని అంటున్న ఈ కాలంలో ప్రతిరోజూ వందలాది కవితలతో పుంఖానుపుంఖాలుగా వీళ్ళంతా కవిత్వం ఎలా రాయగలుగుతున్నారు. ఒకసారి ప్రశ్నించి ఆలోచించవలసిన సందర్భం వచ్చింది. దీనిబట్టి ఆలోచిస్తే తెలుగు కవిత్వం ఎక్కడికీ పారిపోలేదు. ఎక్కడా కనుమరుగు అవ్వలేదు. చదివేవాళ్లు, రాసేవాళ్ళూ ఏమాత్రం తగ్గలేదు సరికదా.. ఇంకా విస్తృత సంఖ్యలో పెరిగారన్నది వాస్తవం. కాని వీరికి సరైన తర్ఫీదు (గైడెన్స్) ఇచ్చేవారే లేరు. ఆ బాధ్యత తీసుకునేవాళ్ళే లేరు. ఒకప్పుడు కవిత్వం మీద ప్రేమ ఉన్నవాళ్ళు సాహిత్య సంస్థలు నిర్వహించే సాహిత్య సభలకు వందలాది మంది విచ్చేసి పాల్గొనేవారు. కాని నేటి ఈ స్పీడ్ యుగంలో సాహిత్య సభలకి వచ్చి, తమ విలువైన సమయం కవిత్వపు తర్ఫీదుకు కేటాయించి సమాజ శ్రేయస్సుకు వినియోగించేవారే కరువయ్యారు. పట్టుమని ఒక సాహిత్య సభలో అయినా ఇరవైకు మించి ప్రేక్షకులు ఉండటం లేదు. కారణం, ఎక్కడికీ కదలకుండా తమ తమ రోజువారీ కార్యకలాపాలను నిర్వహించుకుంటూనే సెల్ ఫోన్లోని సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా లైవ్ లో తమ కవితాతృష్ణను తీర్చుకునేవారి సంఖ్యే ఎక్కువగా కనిపిస్తోంది. దీనిని ఎవరూ తప్పు పట్టవలసిన అవసరం లేదు. కాని కొత్తగా కవిత్వం రాసేవారు తప్పకుండా తమకంటే సీనియర్లయిన కవులు, విస్తృతంగా కవిత్వం రాస్తూ పేరు ప్రఖ్యాతలు పొందుతున్నవారి ఇతర కవుల కవిత్వం కూడా చదవాలి. అలా చదవడం వల్ల కొత్త కొత్త శైలులు అలవరుచుకుంటూ, అవగాహన చేసుకుంటూ.. కొత్త ఆలోచనలతో, కొత్త విధానాలతో తమ కవిత్వాన్ని మరింత కొత్తగా మెరుగులు దిద్దుకోవడానికి అస్కారం ఉంటుందన్న సత్యం (ఏ విధమైన ఇగోలకు తావివ్వకుండా) కొత్తవారు గ్రహించాలి. ఒకప్పుడు ఇలాంటి కొత్తవారికి 'కవిత్వం వర్క్ షాట్లు', కథా వర్క్ షాట్లు, కార్యశాలలు కొన్ని సాహిత్య సంస్థలు నిర్వహించేవారు. కాని నేడు ఇలా ఏ సంస్థ అయినా నిర్వహించినా, సమయం తీసుకొని అల్లంత సుదూర తీరాలనుండి వచ్చి పాల్గొనే ఓపిక పట్టుమని పదిమందికి కూడా ఉండటం లేదు. దీనికి పరిష్కారం తెలుగు సాహిత్య రంగంలోని ఉద్దండులు కనుగొని, తగు ప్రయత్నాలు చేపట్టాలి.. తెలుగు సాహిత్యం బ్రతికి సరైన దారిలో నడవాలంటే ఎవరో ఒకరు నడుం కట్టాలి. జూమ్, ఫేస్ బుక్ వేదికలని చాలామంది దుర్వినియోగం చేస్తున్నారు గాని, దానిని సరైన విధంగా మలిచి, అందరికీ పనికివచ్చే వర్క్ షాట్లుగా తీర్చిదిద్దవలసిన అవసరం ఉంది. దీనిని తక్కువగా అంచనా వేసి దూరంగా ఉండడం కంటే, సాధ్యమైనంత వరకు అందరూ ఈ వర్క్ షాట్లను సద్వినియోగం చేసుకొని, కొత్త కలాలు మరింత వినూత్నరీతిలో తెలుగు సాహిత్యపు ముందుతరం దూతలుగా ముమ్ముందుకు దూసుకు పోయేలా కృషి చేయాలి.

- చలపాక ప్రకాష్, సెల్: 9247475975

గోవా కాంగ్రెస్‌లో బీజేపీ లొల్లి

- పార్టీ సమావేశానికి ఏడుగురు ఎమ్మెల్యేల గైర్హాజరు
- తమతో టచ్‌లో ఉన్నారంటున్న కాషాయ పార్టీ
- డిప్యూటీ స్పీకర్ ఎన్నిక రద్దు

పనాజీ: ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను చీల్చడం పనిగా పెట్టుకున్న బీజేపీ తాజాగా గోవాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై కన్నేసింది. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రచారంపొందిన దిగంబర్ కామత్‌తో సహా ఏడుగురు ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని బీజేపీ చెప్పుకుంటోంది. అయితే ఈ వార్తలను కాంగ్రెస్ పార్టీ తోసిపుచ్చింది. 40 మంది సభ్యులున్న గోవా అసెంబ్లీలో అధికార బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు 25 మంది, ప్రతిపక్ష కాంగ్రెస్‌కు 11 మంది ఎమ్మెల్యేలున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. గోవా శాసనసభ వర్షాకాల, బడ్జెట్ సమావేశాలు మంగళవారం ప్రారంభంకానున్నాయి. రెండు వారాలపాటు ఈ సమావేశాలు కొనసాగుతాయి. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్, సభలో లేవనెత్తాల్సిన అంశాలపై చర్చించేందుకు ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ముగ్గురు గైర్హాజరయ్యారు. దిగంబర్ కామత్, మరో ఇద్దరు ఎమ్మెల్యేలు గైర్హాజరైన వారిలో ఉన్నారు. వారిలో కొందరు బీజేపీతో టచ్‌లో ఉన్నట్లుగా మీడియా కథనాలు వెలువడ్డాయి. మైఖేల్ లోబోను ప్రతిపక్ష నేతగా నియమించడంపై దిగంబర్ కామత్ అసంతృప్తితో ఉన్నట్లుగా తెలుస్తున్నది. అయితే, గోవా కాంగ్రెస్ అధ్యక్షుడు అమిత్ పాట్కర్ ఈ వదంతులను తోసిపుచ్చారు. అధికారంలో ఉన్న బీజేపీ ఇలాంటి అవాస్తవాలను ప్రచారం చేస్తున్నదని విమర్శించారు. పార్టీ ఎమ్మెల్యేల్లో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని అన్నారు. ఇదిలావుండగా, ఈ నెల 12న జరగాల్సిన అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ ఎన్నికల ప్రక్రియ రద్దయింది. ఈ మేరకు స్పీకర్ రమేశ్ తవాడ్కర్ ఆ ఎన్నిక నోటిఫికేషన్‌ను ఆదివారం రద్దు చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలోని కొందరు ఎమ్మెల్యేలు పార్టీ మారడానికి సిద్ధమయ్యారనీ, బీజేపీ నుంచి అనుమతి లభిస్తే పార్టీ మారనున్నట్టు విశ్వసనీయ సమాచారం. అసెంబ్లీ విధివిధానాలకు సంబంధించిన రూల్ 308 కింద ఎన్నికల నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్టు అసెంబ్లీ కార్యదర్శి నమ్రత ఉల్మాన్ ఉత్తర్వులు జారీ చేశారు.



దేశమంతటా భక్తిశ్రద్ధలతో ఈద్

శ్రీనగర్: దేశవ్యాప్తంగా ఆదివారం ఈద్‌ను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రవక్త ఇబ్రహీం తన ప్రభువు కోసం త్యాగం చేసిన వేడుక ఈద్-ఉల్-అదా ఆదివారం కశ్మీర్ అంతటా ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో మసీదుల వద్ద ప్రార్థనలు చేయడానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారని అధికారులు తెలిపారు. హజ్రత్‌బాల్ పుణ్యక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో సుమారు 45వేల మంది హాజరైనట్టు పేర్కొన్నారు. పాతబస్తీలోని చారిత్రాత్మక జామియా మసీదు మినహా లోయ అంతటా ఉన్న అన్ని ముస్లిం ప్రార్థనా స్థలాలలో చిన్న చిన్న సమావేశాలు జరిగాయి. అంజుమన్ ఔకాఫ్ జామియా మసీదులో ఉదయం 9 గంటలకు ప్రార్థనలు చేసేందుకు అధికారులు అనుమతి నిరాకరించారు. సంప్రదాయం ప్రకారం లోయలో వేలాది గొర్రెలు, మేకలు, ఇతర జంతువులను బలి ఇచ్చారని వారు తెలిపారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. "ఈద్-ఉల్-జుహా శుభ సందర్భంగా శుభాకాంక్షలు. ఈ పండుగ మానవత్వం ఐక్యతపై మన విశ్వాసాన్ని పునరుద్ఘాటించటానికి, పేద, వెనుకబడిన వారి పట్ల దాతృత్వం వహించడానికి ఒక సందర్భం. ఈ పండుగ సౌభ్రాతృత్వ బంధాలను బలపరుస్తుంది. ప్రతి ఒక్కరికీ శాంతి, సంతోషం ఆనందాన్ని కలిగిస్తుంది. ఈద్ ముబారక్' అని ట్వీట్ చేశారు. ఈద్ ప్రార్థనలు ప్రశాంతంగా ముగిశాయని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని పోలీసు అధికారి తెలిపారు. జమ్ముకశ్మీర్‌లోని రాజకీయ పార్టీల నేతలు కూడా ప్రజలకు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు.

భారతదేశం ఎల్లప్పుడూ

'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' కోసం నిలుస్తుంది

న్యూఢిల్లీ: భారతదేశ సంప్రదాయం ఎల్లప్పుడూ 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' (ఒకే భారతదేశం, గొప్ప భారతదేశం) కోసం నిలుస్తుందని, రామకృష్ణ మిషన్ స్థాపన కూడా దీనితో ముడిపడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం అన్నారు. ఆధ్యాత్మిక సంస్థ మాజీ అధిపతి స్వామి ఆత్మస్థానానంద జయంతి వేడుకలపై వీడియో ఒక వీడియో సందేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సంస్థను స్థాపించిన స్వామి వివేకానంద భారతదేశాన్ని గొప్పగా మార్చడం కోసం జీవించారని మోదీ తెలిపారు. 'ఆయన ప్రభావం దేశంలోని అన్ని ప్రాంతాలలో కనిపించింది. ఆయన ప్రయాణాలు ఆ బానిసత్వ యుగంలో జాతీయ చైతన్యాన్ని మేల్కొల్పాయి. దానిపై కొత్త విశ్వాసాన్ని నింపాయి. ఈ సంప్రదాయాన్ని ఆత్మస్థానానంద తన జీవితాంతం ముందుకు తీసుకెళ్లారు' అని అన్నారు. 'వందల సంవత్సరాల క్రితం ఆదిశంకరాచార్యులు కావచ్చు లేదా ఆధునిక కాలంలో స్వామి వివేకానంద కావచ్చు, భారతదేశ సంప్రదాయం ఎల్లప్పుడూ 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' అని ప్రకటిస్తూనే ఉంది. రామకృష్ణ మిషన్ స్థాపన కూడా 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' ఆలోచనతో ముడిపడి ఉంది' అని ప్రధాని మోదీని ఉటంకిస్తూ ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంవో) ఒక ప్రకటనలో పేర్కొంది. 130 కోట్ల మంది పౌరుల సమష్టి సంకల్పంతో సాధించలేని లక్ష్యం ఏదీ లేదని, ఆలోచనలు విస్తృతంగా ఉన్నప్పుడు ప్రజలు తమ ప్రయత్నాలలో ఒంటరిగా ఉండరని ఋషులు మనకు చూపించారని మోదీ అన్నారు. 'డిజిటల్ ఇండియా' ఉదాహరణను ఇస్తూ, డిజిటల్ చెల్లింపుల రంగంలో భారతదేశం ప్రపంచ అగ్రగామిగా ఎదిగిందని తెలిపారు. భారత ప్రజలకు 200 కోట్ల వాక్సిన్ మోతాదులను అందించడం ద్వారా సాధించిన విజయాలను కూడా ప్రధాని ఈ సందర్భంగా ప్రస్తావించారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రతి జిల్లాలో 75 'అమృత్ సరోవరాలు' తయారు చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ ప్రజలను చైతన్యపరచాలని, మానవ సేవ గొప్ప పనిలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

శ్రీలంక ప్రజలకు, ప్రభుత్వానికి

భారత్ సహాయం కొనసాగిస్తుందని ఆశిస్తున్నా

న్యూఢిల్లీ: ఈ సంక్షోభ సమ యంలో శ్రీలంక, దాని ప్రజలకు ఆదివారం కాంగ్రెస్ సంఘీభావం తెలిపింది. ప్రస్తుత పరిస్థితిని ఎదుర్కోవడంలో పొరుగు దేశానికి భారతదేశం సహాయం కొనసాగి స్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఒక సందేశంలో శ్రీలంకలో పరిణామం చెందుతున్న రాజకీయ పరిస్థితులపై కాంగ్రెస్ పార్టీ ఆందోళనతో అనుసరిస్తోందని అన్నారు. ఆర్థిక సవాళ్లు, పెరుగుతున్న ధరలు, ఆహారం, ఇంధనం, నిత్యావసర వస్తువుల కొరత అక్కడి ప్రజలలో అపారమైన కష్టాలు, బాధలను కలిగించాయని ఆమె అన్నారు. 'ఈ తీవ్రమైన సంక్షోభ సమయంలో శ్రీలంక, దాని ప్రజలకు కాంగ్రెస్ పార్టీ తన సంఘీభావాన్ని తెలియజేస్తుంది. వారు దానిని అధిగమించ గలరని ఆశిస్తున్నాము' అని సోనియా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ప్రస్తుత పరిస్థితుల ఇబ్బందులను ఎదుర్కొనేందుకు శ్రీలంక ప్రజలు, ప్రభుత్వానికి భారతదేశం సహాయం కొనసాగిస్తుందని మేము ఆశిస్తున్నాము' అని కూడా ఆమె అన్నారు. శ్రీలంకకు అన్ని రకాల సహాయ, సహకారాలు అందించాలని అంతర్జాతీయ సమాజాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ కోరుతుందని గాంధీ చెప్పారు.

కుటుంబ న్యాయస్థానాల అధికార పరిధి ప్రశ్నార్థకం

న్యూఢిల్లీ: రెండు రాష్ట్రాల్లో వివాహ సంబంధిత వివాదాలను త్వరగా పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన కుటుంబ న్యాయస్థానాల అధికార పరిధిపై కేంద్ర ప్రభుత్వ తప్పనిసరి నోటిఫికేషన్ లేకపోవడం ప్రశ్నార్థకమైంది. న్యాయపరమైన ఇబ్బందులను అధిగమించేందుకు, హిమాచల్‌ప్రదేశ్, నాగాలాండ్‌లోని కుటుంబ న్యాయస్థానాల్లో న్యాయాధికారులు, న్యాయస్థాన సిబ్బంది నియామకాన్ని పునరాలోచన ప్రభావంతో ధృవీకరించడానికి ప్రభుత్వం బిల్లును తీసుకువస్తోందని అధికారిక వర్గాలు తెలిపాయి. కుటుంబ న్యాయస్థానాల (సవరణ) బిల్లు, 2022 జూలై 18 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. కుటుంబ న్యాయస్థానాలను ఏర్పాటు చేయడం, వాటి పనితీరు సంబంధిత హైకోర్టులతో సంప్రదించి రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కుటుంబ న్యాయస్థానాల చట్టం, 1984, రాజీని ప్రోత్సహించడానికి, వివాహం, కుటుంబ వ్యవహారాలకు సంబంధించిన వివాదాలను త్వరితగతిన పరిష్కరించేందుకు హైకోర్టులతో సంప్రదించి రాష్ట్ర ప్రభుత్వాలు కుటుంబ న్యాయస్థానాలను ఏర్పాటు చేస్తాయి. అటువంటి కోర్టులు ఏర్పాటైన రాష్ట్రంలో 1984 చట్టంలోని నిబంధనలను అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వ నోటిఫికేషన్ తప్పనిసరి. కానీ అలాంటి మూడు కోర్టులను నిర్వహిస్తున్న హిమాచల్ ప్రదేశ్ విషయంలో అలాంటి నోటిఫికేషన్ జారీ చేయలేదు. నాగాలాండ్ అలాంటి రెండు కోర్టులను నిర్వహిస్తోంది. హిమాచల్ ప్రదేశ్‌లోని కుటుంబ న్యాయస్థానాల చెల్లుబాటును కేంద్ర ప్రభుత్వ నోటిఫికేషన్ లేకపోవడంతో గత ఏడాది రాష్ట్ర హైకోర్టులో సవాలు చేశారు. ప్రస్తుతం 26 రాష్ట్రాల్లో 710 కుటుంబ న్యాయస్థానాలు పనిచేస్తున్నాయి.

18వేలపైనే కొత్త కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కొవిడ్ వ్యాప్తి కొనసాగుతోంది. స్వల్ప హెచ్చుతగ్గులతో కొత్త కేసులు 18 వేలపైనే నమోదవుతున్నాయి. మరోవైపు క్రియాశీల కేసులు 1.3 లక్షలకు సమీపించడం ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. గడిచిన 24 గంటల్లో 4,32,777 కొవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. కొత్తగా 18,257 కేసులు వెలుగులోకి వచ్చాయి. శనివారం కరోనాతో 42 మంది ప్రాణాలు కోల్పోగా.. ఇప్పటి వరకు మృతి చెందిన వారి సంఖ్య 5,25,428కు చేరింది. శనివారం 14,553 మంది కోలుకోగా.. ఇప్పటి వరకూ వైరస్‌ను జయించిన వారి సంఖ్య 4.29 కోట్లు(98.50%) దాటింది. ఇక దేశంలో క్రియాశీల కేసులు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. ప్రస్తుతం యాక్టివ్ కేసుల సంఖ్య 1,28,690 (0.30%)కు పెరిగింది. దేశవ్యాప్తంగా వాక్సినేషన్ కొనసాగుతోంది.

ఉప రాష్ట్రపతి ఎన్నికకు

బీజేపీ అడ్డదారులు

- లబ్ధి కోసమే రాజ్యసభకు నలుగురి నామినేట్
- నిపుణుల ఆగ్రహం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న ఎన్డీయేకి లోక్‌సభలో తగినంత మెజారిటీ ఉన్నప్పటికీ రాజ్యసభలో లేదు. దానితో వచ్చే నెలలో జరగనున్న ఉప రాష్ట్రపతి ఎన్నికలో విజయం సాధించేందుకు బీజేపీ ఇప్పటి నుంచే అడ్డదారులు తొక్కుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైన మరుసటి రోజే రాజ్యసభకు నలుగురు సభ్యులను నామినేట్ చేయటం ఇందులో భాగమేనని రాజకీయ విశ్లేషకులు విమర్శిస్తున్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక నోటిఫికేషన్ ఈ నెల 5న విడుదలైంది. ఆ మరుసటి రోజే ఇళయరాజా, వీరేంద్ర హెగ్డే, పీటీ ఉష, విజయేంద్ర ప్రసాద్‌ను రాజ్యసభకు రాష్ట్రపతి కోటాలో ఎన్డీయే సర్కారు నామినేట్ చేసింది. ఉపరాష్ట్రపతి ఎన్నిక జరిగే సమయంలో వాళ్లను నామినేట్ చేసి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కేంద్రంలోని మోదీ సర్కారు ఈ చర్యకు పాల్పడిందని రాజ్యాంగవేత్తల నుంచి విమర్శలు వస్తున్నాయి. పార్లమెంట్ ఉభయ సభల సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ ఉపరాష్ట్రపతిని ఎన్నుకుంటుంది. కొత్తగా నామినేట్ అయినవారు కూడా ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఓటు వేసేందుకు అర్హత సాధిస్తారు. దీన్ని అదనుగా తీసుకొని కేంద్రం ఈ అడుగు వేసిందని, బీజేపీ తీరు సరికాదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

భారీ వర్షాలతో అతలాకుతలం

అహ్మదాబాద్: దక్షిణ గుజరాత్‌లోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ కారణంగా కొన్ని నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. నవ్సారి, వల్సాద్ జిల్లాల్లో 700 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు ఆదివారం తెలిపారు. ఒర్సాంగ్ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వల్సాద్‌లోని కొన్ని లోతట్టు ప్రాంతాల్లో మునిగిపోయాయి. కావేరీ, అంబికా నదులు ప్రమాదకర స్థాయికి మించి ప్రవహిస్తున్నారు. ఈ కారణంగా నవ్‌సారి జిల్లాలో కూడా అధికారులు అప్రమత్తంగా ఉన్నట్టు తెలిపారు. శనివారం రాత్రి, ఆదివారం ఉదయం వల్సాద్, నవ్‌సారి జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయని పేర్కొన్నారు. ఛోటా ఉదేపూర్, నర్మదా జిల్లాల్లో కూడా భారీ వర్షాలు కురిశాయని, నదులు పొంగిపొర్లాయని, లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయన్నారు. దక్షిణ గుజరాత్‌లోని డాంగ్, నవ్‌సారి, వల్సాద్ జిల్లాల్లో రాబోయే ఐదు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఆదివారం అంచనా వేసింది. దక్షిణ గుజరాత్, సౌరాష్ట్రలోని ఇతర జిల్లాలు కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. వల్సాద్‌లో, ఒర్సాంగ్ నది మట్టం పెరగడం, లోతట్టు ప్రాంతాలలో వరదలు సంభవించడంతో 400 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. వల్సాద్‌లో ఆదివారం వర్షం తగ్గడం కొంత ఉపశమనమైనంది. దీంతో వరదనీరు తగ్గుముఖం పట్టడంతో ప్రజలు తమ ఇళ్లకు తిరిగి రావడం ప్రారంభించారని వారు తెలిపారు. దక్షిణ, మధ్య గుజరాత్, సౌరాష్ట్ర ప్రాంతంలోని అనేక ఆనకట్టలు, నదులు శనివారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పొంగిపొర్లుతున్నాయి.

తూర్పు రాజస్థాన్‌లో భారీ వర్షం

జైపూర్: తూర్పు రాజస్థాన్‌లోని వివిధ ప్రదేశాల్లో 24 గంటల వ్యవధిలో భారీ వర్షపాతం నమోదైంది, కొన్ని చోట్ల ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం నమోదైందని వాతావరణ అధికారులు తెలిపారు. వాతావరణ శాఖ ప్రకారం, ఝలావర్‌లోని ఖాన్‌పూర్, ధోల్‌పూర్‌లోని సర్మథుర, కోటలోని మంధనలో ఒక్కొక్కటి 7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. బసేది, బికనీర్ మరియు చత్రాలలో ఒక్కొక్కటి 6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది, తరువాత సికార్ తహసీల్, బయానా పట్టణం మరియు బికనేర్ తహసీల్‌లలో ఒక్కొక్కటి 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆదివారం బరన్, ఝలావర్, కోటా జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆ శాఖ అంచనా వేసింది.

మంగుళూరులో విరిగిపడిన కొండచరియలు

మంగళూరు: ఆదివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి అగుంబే ఘాట్ రోడ్డులోని సోమేశ్వర వైపు నుంచి కొండచ రియలు విరిగిపడడంతో ఆ మార్గంలో వాహ నాల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని అధికారిక వర్గాలు తెలిపాయి. ఉడిపి, శివమొగ్గ జిల్లాలను కలిపే జాతీయ రహదారి 169ఏపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్ప డింది. రహదారిని చక్కదిద్దే పనిని అటవీశాఖ, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సిబ్బంది చేపట్టారు. ఘాట్ సెక్షన్‌లో ట్రాఫిక్‌ను పోలీసులు మళ్లిస్తున్నారు. శివమొగ్గ నుంచి ఉడిపి వెళ్లే వాహనాలను సిద్దాపుర మార్గంలో మళ్లిస్తున్నారు. అగుంబే ఘాట్ చెక్‌పోస్టు, సోమేశ్వర్ చెక్‌పోస్టు వద్ద వాహనాలను నిలిపివేస్తున్నామని, డ్రైవర్లు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు.

పెరిగిన నేత్రావతినది నీటిమట్టం

దక్షిణ కన్నడ (డీకే) జిల్లా బంట్వాల్ తాలూకాలోని నేత్రావతి నదిలో ఆదివారం నీటిమట్టం 8.5 మీటర్ల ప్రమాద స్థాయికి చేరుకుంది. శనివారం 6.8 మీటర్ల వద్ద ఉన్న నీటి మట్టం సాయంత్రానికి గణనీయంగా పెరిగి ఉప్పినంగడి వద్ద ఆదివారం ఉదయం ప్రమాద స్థాయిని తాకినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. జిల్లాలో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బంట్వాళలోని నదీ పరివాహక ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. పానెమంగళూరు, కంచికర్ మార్కెట్, జక్రిబెట్టు, కైకుంజె బస్తిపాడు సహా ప్రాంతాలు నీట మునిగాయి. బంట్వాళ తాలూకా తహశీల్దార్ స్మితారాము, పోలీసు అధికారులు ప్రభావిత ప్రాంతాల్లో క్యాంపులు చేసి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మంగళవారం వరకు వాతావరణ శాఖ జారీ చేసిన రెడ్ అలర్ట్ దృష్ట్యా బోట్లు, డైవింగ్ నిపుణులు, అగ్నిమాపక సిబ్బందిని ఆ ప్రాంతానికి రప్పించారు. ఇదిలా ఉండగా, దక్షిణ కన్నడ, ఉడిపిలోని పలు ప్రాంతాల్లో సముద్ర కోత తీవ్రమైంది. డీకే జిల్లాలోని శశిహిత్లు, ఉచ్చిల, ఉల్లా, బాట్‌పాడు వద్ద తీరంలో భారీ విధ్వంసం సంభవించగా, ఉడిపిలోని మరవంతె, కాపు, పాడుబిద్రి, షిరూర్, కిరిమంజేశ్వర సహా ప్రాంతాలు తీవ్ర ప్రభావానికి లోనయ్యాయి.

అధిక ధరలపై శివపార్వతుల వేషాల్లో నిరసన

- ఓర్వలేక పోయిన వీహెచ్‌పీ, భజరంగదళ్
- శివుడి వేషం కట్టిన వ్యక్తి అరెస్టు
- సీఎం స్పందనతో బెయిల్‌పై విడుదల

గుహవాటి: ప్రజలను ఇక్కట్ల పాలు చేస్తోన్న ఇంధనం, గ్యాస్, నిత్యాసరధరల పెరుగుదలను నిరసిస్తూ ప్రజల దృష్టిని ఆకర్షించేలా శివపార్వతుల వేషధారణలో అసోంలో వేసిన వీధి నాటకం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మతపరమైన మనోభావాల్ని దెబ్బతీశాడంటూ విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్ కార్యకర్తలు ఇచ్చిన ఫిర్యాదుపై అత్యుత్సాహం చూపిన పోలీసులు శివుడి వేషం వేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి జైలే పాలు చేశారు. విషయం సీఎం హిమంత విశ్వ శర్మ దృషికి చేరడంతో ఆయన ఆదేశాల మేరకు నిరసనకారుడిని విడుదల చేశారు. పూర్తి వివరాల్లోకి వెళితే రాష్ట్రంలోని నాగోన్ జిల్లా కేంద్రంలో బోరా అనే వ్యక్తి (నౌగాంగ్ కాలేజ్ స్టూడెంట్స్ యూనియన్ మాజీ కార్యదర్శి) శనివారం మధ్యాహ్నం తన సహచరులతో కలసి శివపార్వతుల వేషం కట్టి పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం తదితర సమస్యలను లేవనెత్తుతూ నగరంలోని నౌగాంగ్ కాలేజ్ క్లాక్ టవర్ వద్ద వీధి నాటకం ప్రదర్శించారు. శివపార్వతులు ప్రయాణిస్తున్న వాహనం నిలిచిపోయినట్టు నటించారు. ఈ క్రమంలో శివుడు పార్వతితో ప్రభుత్వాల చేత కానితనంతో పెట్రోలు ధరలు పెరిగాయని ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై వ్యంగ్యంగా విమర్శలు గుప్పించారు. నిత్యం పెరుగుతున్న ఇంధనం, ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లు నిత్యావసరాల ధరల పెరుగుదలకు ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు. నిరుద్యోగ సమస్యలను ప్రత్యేకంగా ఎత్తి చూపుతూ ఇచ్చిన హామీలు నిలుపుకోలేని మోదీ ప్రభుత్వ వైఖరిపై విమర్శలు గుప్పించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల సృష్టి అంటూ ఇచ్చిన హామీని గుర్తు చేసేలా వ్యాఖ్యలు చేశారు. ఇదే వీధి నాటకాన్ని నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రదర్శించారు. ఈ నేపథ్యంలో తమకు అనుకూలమైన బీజేపీ ప్రభుత్వంపై నిరసనకారులు చేసిన విమర్శలకు సమాధానం చెప్పుకోలేని వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నేతలు ఈ వీధి నాటకంలో శివపార్వతుల వేషం కట్టిన వ్యక్తులు మతపరమైన మనోభావాలను దెబ్బతీశారని ఆరోపిస్తూ వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలో ఉండడంతో ఫిర్యాదు ఇవ్వడమే తడవుగా కేసులు నమోదయ్యాయి. వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నేతలు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా బోరాపై కేసులు నమోదు చేశామని నాగావ్ ఎస్పీ లీనా డోలీ తెలిపారు. మతపరమైన మనోభావాలను దెబ్బతీయడంతో పాటు రోడ్డు నిబంధనలు పాటించకపోవడంలో వాహనాల చట్టం కింద శివుడి పాత్రను ధరించిన బోరాను అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. బోరా అరెస్టు విషయం వెలుగులోకి రావడంతో సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వ తీరుపై విమర్శలు తీవ్రమయ్యాయి. ప్రభుత్వ విధానాలపై వీధి నాటకం వేస్తే అరెస్టు చేయడాన్ని వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు తప్పుబట్టారు. అరెస్టు చేసిన బోరాను తక్షణమే విడుదల చేయాలని డిమాండు చేశారు. ప్రముఖ న్యాయవాది, రచయిత నవరూప్ సింగ్ ఈ విషయంపై ప్రభుత్వ తీరును తప్పుబడుతూ చేసిన వరుస ట్వీట్లకు సీఎం హిమంత విశ్వ శర్మ స్పందించారు. సమస్యలను ప్రస్తావిస్తూ వీధి నాటకం వేయడం దైవదూషణ కాదని పేర్కొంటూ సీఎం ట్వీట్ చేశారు. శివుడి పాత్రను ధరించిన బోరాను విడుదల చేయాలని జిల్లా పోలీసులకు తగిన ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. నిరసనకారుడు అసభ్యమైన వ్యాఖ్యలు చేయకపోతే ఆయన చేసింది తప్పుకాదని వ్యాఖ్యానించారు. సీఎం ఆదేశాల మేరకు బెయిల్ పొందిన బోరా ఆదివారం విడుదలయ్యారు.

ఒకేసారి 73 లక్షల మందికి పెన్షన్ పంపిణీ

ఈపీఎఫ్ఓ సన్నాహాలు

న్యూఢిల్లీ: కేంద్ర వ్యవస్థ ద్వారా ఒకేసారి 73 లక్షల మంది పెన్షనర్లకు త్వరలో పెన్షన్‌ను పంపిణీ చేయడానికి ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్ఓ) సన్నద్ధమవుతోంది. కేంద్ర పెన్షన్ పంపిణీ వ్యవస్థను నెలకొల్పే ప్రతిపాదనపై జూలై 29, 30 తేదీల్లో జరిగే సమావేశంలో ఈపీఎఫ్ఓ పరిశీలించి ఆమోదం తెలపనుంది. దీనిద్వారా భారతదేశం అంతటా ఒకేసారి 73 లక్షల మంది పెన్షనర్ల బ్యాంక్ ఖాతాలలో పెన్షన్ జమ చేయడానికి మార్గం సుగమం కానుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈపీఎఫ్ఓ 138 ప్రాంతీయ కార్యాలయాలు... ఆయా ప్రాంతాల పరిధిలోని లబ్ధిదారులకు వేర్వేరు రోజుల్లో లేదా సమయాల్లో పెన్షన్‌లను అందజేస్తున్నాయి. 'కేంద్ర పెన్షన్ పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేసే ప్రతిపాదన... జులై 29, 30 తేదీల్లో షెడ్యూల్ చేయబడిన ఈపీఎఫ్ఓ ఉన్నత నిర్ణాయక కమిటీ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) సమావేశంలో ఉంచబడుతుంది' అని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దేశంలోని 138కి పైగా ప్రాంతీయ కార్యాలయాల సెంట్రల్ డేటాబేస్‌ను ఉపయోగించి ఒకేసారి 73 లక్షల మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో ప్రయోజనాన్ని జమ చేయడానికి వీలు కల్పిస్తుందని పేర్కొన్నాయి. నవంబర్ 20, 2021న జరిగిన సీబీటీ 229వ సమావేశంలో, సి-డాక్ ద్వారా కేంద్రీకృత ఐటీ-ఎనేబుల్డ్ సిస్టమ్‌ల అభివృద్ధి ప్రతిపాదనను ట్రస్టీలు ఆమోదించారు.

హిమాచల్‌ప్రదేశ్‌లో ఆప్ తిరంగా యాత్ర రేపు

నూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ హిమాచల్ ప్రదేశ్‌లో పర్యటించనున్నారు. కొండ ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు పాలంపూర్‌లో తన పార్టీ రాష్ట్ర శాఖ నిర్వహించే తిరంగా యాత్రలో పాల్గొననున్నారు. మంగళవారం అసెంబ్లీ నియోజకవర్గంలో జరగనున్న కార్యక్రమంలో కేజ్రీవాల్‌తో కలిసి పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కూడా రాష్ట్రానికి వస్తారని పార్టీ ఆదివారం తెలిపింది. ఒక నెల వ్యవధిలో ఎన్నికలకు వెళ్లే రాష్ట్రానికి ఆప్ అధినేత, పంజాబ్ సీఎం మన్ రెండో పర్యటన ఇది. 'ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ జులై 12న పాలంపూర్‌లో తిరంగా యాత్రలో పాల్గొనేందుకు హిమాచల్ ప్రదేశ్‌ను సందర్శించనున్నారు. పంజాబ్ ముఖ్యమంత్రి మాన్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు" అని పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. జూన్ 11న హిమాచల్ ప్రదేశ్‌లోని విద్యా స్థితిపై చర్చించేందుకు హమీర్‌పూర్ జిల్లాలో ఏర్పాటు చేసిన టౌన్ హాల్ సమావేశంలో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, పంజాబ్ సీఎం మన్ పాల్గొననున్నారు.

ఈ సందర్భంగా కేజ్రీవాల్, మన్ మాట్లాడుతూ, ప్రస్తుతం బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రంలో విద్య మరియు ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను మెరుగుపరుస్తామని హామీ ఇస్తూ రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీకి (ఆప్) అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరారు. హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8.5 లక్షల మంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలంటే ఆప్‌కి అవకాశం ఇవ్వండి అని కేజ్రీవాల్ అన్నారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 68 స్థానాల్లో పోటీ చేస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రకటించింది.

సహకార బ్యాంకింగ్‌లో రెండంచెల విధానం

సీఎం జగన్‌కు లేఖలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: సహకార బ్యాంకింగ్ వ్యవస్థలో రెండంచెల విధానం అమలుచేసి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను రాష్ట్ర సహకార బ్యాంకులో విలీనం చేసేందుకు చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సీఎం జగన్‌కు ఆయన లేఖ రాశారు. రైతాంగానికి వ్యవసాయ రుణాలు, గ్రామీణాభివృద్ధికి నిధులు సమకూర్చటంలో సహకార బ్యాంకింగ్ వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. నాబార్డ్ నుంచి ఆప్కాబ్‌కు, ఆప్కాబ్ నుంచి జిల్లా కేంద్ర సహకార బ్యాంకులకు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల నుంచి ప్రాథమిక సహకార పరపతి సంఘాలకు, చివరకు పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు రుణాలను అందచేస్తున్నారన్నారు. ప్రతి అంచెలో రెండు లేదా మూడు శాతం వడ్డీ వేసుకుని వ్యవసాయ రుణాలకు నిధులు అందచేస్తారనీ, దీనివల్ల రైతాంగానికి వడ్డీ భారం పెరిగిపోతోందనీ, అందువల్ల జిల్లా కేంద్ర సహకార బాంకులను రాష్ట్ర సహకార బ్యాంకులో విలీనం చేసి, వాటిని బ్రాంచీలుగా మార్పు చేసి, తద్వారా రెండంచెల విధానాన్ని ప్రవేశపెట్టాలన్నారు. దీనివల్ల తక్కువ వడ్డీకే రైతులకు వ్యవసాయ రుణాలను అందించటం సాధ్యమవుతుందని, అధిక వడ్డీ భారం నుంచి రైతాంగానికి వెసులుబాటు కలుగుతుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సహకార బ్యాంకు ఉద్యోగులు, రైతులు, సహకార వేత్తలు, ప్రజాస్వామికవాదులు, అనేక రాజకీయపార్టీలు రెండంచెల విధానాన్ని తీసుకురావడం ద్వారా సహకార వ్యవస్థను బలోపేతం చేయాలని మూడు దశాబ్దాలుగా కోరుతున్నారన్నారు. ఈ వ్యవస్థాగత మార్పులు ఆవశ్యమని చాలా కమిటీలు ప్రతిపాదించడం గమనార్హమని తెలిపారు. నాబార్డ్ మాజీ చైర్‌పర్సన్, బ్యాంకింగ్ రంగ నిపుణులు రంజనా కుమార్ రెండంచెల విధానాన్ని అమలు చేయటం ద్వారా సహకార బ్యాంకింగ్ వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. కేరళతోసహా 12 రాష్ట్రాలలో సహకార బ్యాంకింగ్ వ్యవస్థను రెండంచెల విధానానికి మార్పు చేశారన్నారు. మరొక 7, 8 రాష్ట్ర ప్రభుత్వాలు రెండంచెల అమలుకు ఆర్‌బీఐ అనుమతి కోరాయని, రెండంచెల అమలుకోసం రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించాల్సిన విధివిధానాలపై ఆర్‌బీఐ మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. ఈ రెండంచెల విధానం వల్ల తక్కువ వడ్డీరేట్లకు వ్యవసాయ రుణాల కోసం రెండంచెల విధానం సహకార రంగంలో రాజకీయ జోక్యం నివారణతోపాటు సహకార బ్యాంకులలో పాలనా సౌలభ్యం కలుగుతుందన్నారు. బ్యాంకింగ్ రంగంలో పోటీని తట్టుకునేందుకు సహకార బ్యాంకింగ్ రంగంలో సులభతర వాణిజ్యంతోపాటు పాలనా ఖర్చులలో గణనీయమైన తగ్గుదల, త్వరితగతిన రైతాంగ అవసరాలు తీర్చటం వంటి వివిధ ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను రాష్ట్ర సహకార బ్యాంకు (ఆప్కాబ్)లో విలీనం చేసి, వాటిని బ్రాంచీలుగా మార్పు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అంతరిక్ష ఆస్తుల పరిరక్షణలో భారత్ స్వావలంబన

నేడు బెంగళూరులో ఐఎస్40ఎం ప్రారంభం

బెంగళూరు: సురక్షితమై, స్థిరమైన అంతరిక్ష కార్యకలాపాల నిర్వహణ (ఐఎస్40ఎం) కోసం ఇస్రోతో కలిసి తన అంతరిక్ష ఆస్తులను కాపాడుకోవడంలో భారతదేశం స్వావలంబనకు ప్రోత్సాహాన్ని ఇచ్చింది. కేంద్ర అంతరిక్ష శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సోమవారం ఇక్కడ అంతరిక్ష శాఖ కార్యదర్శి, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చైర్మన్ ఎస్.సోమనాథ్ సమక్షంలో ఐఎస్40ఎంని ప్రారంభించనున్నారు. ఇస్రో ప్రకారం, ఐఎస్4ఓఎం అనేది జాతీయ అభివృద్ధికి బాహ్య అంతరిక్షాన్ని సుస్థిరంగా ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలను పొందుతూ, అంతరిక్ష పర్యావరణం భద్రత, స్థిరత్వాన్ని నిర్ధారించే దిశగా సమగ్ర విధానంతో రూపొందించబడిన వ్యవస్థ. 'అంతరిక్ష వ్యర్థాలను గుర్తించడం, వాటిని పర్యవేక్షించడం కోసం ఇది అంతరిక్ష పరిస్థితుల అవగాహన (ఎస్ఎస్ఏ) కార్యక్రమంలో భాగం' అని ఇస్రో అధికారి ఒకరు తెలిపారు. 'ఇది ఇతర అంతరిక్ష వస్తువులతో మన క్రియాశీల ఉపగ్రహాల సంభావ్య తాకిడిని గుర్తించడం, మన అంతరిక్ష ఆస్తులను (ఉపగ్రహాలు) పరిరక్షించడానికి సరైన యుక్తితో ఘర్షణలను నివారించడం' అని ఆయన వివరించారు. అంతరిక్ష వస్తువుల కక్ష్య నిర్ధారణ, సహసంబంధం, జాబితా చేయడం, పరిశీలనా సౌకర్యాల నుంచి సమాచారాన్ని ఏకకాలంలో పంపించే ప్రక్రియ ఇక్కడ జరుగుతుందని బెంగళూరు ప్రధాన కార్యాలయంగా గల అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) వర్గాలు తెలిపాయి. దీనికి అదనంగా, ఐఎస్40ఎంలో భాగంగా అంతరిక్ష శిథిలాల నివారణ, యూఎన్/ ఇంటర్-ఏజెన్సీ స్పేస్ డెబ్రిస్ కోఆర్డినేషన్ కమిటీ (ఐఏడీసీ) మార్గదర్శకాల సమ్మతి ధ్రువీకరణ, వివిధ ఆర్అండ్‌డీ కార్యకలాపాల కోసం ప్రత్యేక ప్రయోగశాలలు కూడా ఏర్పాటయ్యాయి. ఐఎస్40ఎం మన స్వంత అంతరిక్ష ఆస్తులను రక్షించడంలో మన స్వయం-విశ్వాసాన్ని (ఆత్మనిర్భరత) ని పెంచుతుంది. శిథిలాల నిర్వహణపై యూఎన్ ఆదేశాలను కూడా చేరుస్తుంది' అని ఇస్రో ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఈ ఏడాది మార్చిలో తన 'స్పేస్ సిట్యుయేషనల్ అసెస్‌మెంట్ 2021' ని ప్రపంచ దృక్కోణంలో పంచుకుంటూ, కక్ష్యలోని వ్యర్థాలతో సహా అంతరిక్ష వస్తువుల ఢీకొనే బెదిరింపులు బాహ్య అంతరిక్షంలో సురక్షితమైన, స్థిరమైన ఉపయోగం కోసం శాశ్వత సమస్యగా మారాయని ఇస్రో తెలిపింది. ప్రస్తుతం లక్షలాది అంతరిక్ష శిథిలాలు, వేల సంఖ్యలో పనిచేసే ఉపగ్రహాలు భూమికి ఎగువన వేర్వేరు ఎత్తుల్లో భూమి చుట్టూ తిరుగుతున్నాయి. ఈ అంతరిక్ష వస్తువులు తక్కువ భూమి కక్ష్యలో సగటున గంటకు 27 వేల కి.మీ వేగంతో కదులుతాయి. అందువల్ల, ఒక సెంటీమీటర్ పరిమాణంలో ఉన్న చిన్న ముక్కతో కూడా ఢీకొనడం అనేది కార్యాచరణ అంతరిక్ష ఆస్తికి విపత్తుగా ఉంటుంది. ఈ కక్ష్యలో ఉన్న అంతరిక్ష శిథిలాలు ప్రస్తుతం కక్ష్యలో ఉన్న దాదాపు 3 వేల కార్యాచరణ ఉపగ్రహాలకు ముప్పు కలిగిస్తాయి. ఇవి క్లిష్టమైన ఆధునిక కమ్యూనికేషన్, వాణిజ్యం, ప్రయాణం, భద్రతా వ్యవస్థలకు ఉపయోగిస్తారు. కార్యాచరణ అంతరిక్ష ఆస్తులకు ఏదైనా నష్టం జరిగినా, అది సమాచార, ఆర్థిక, విద్యుత్,పవర్, రవాణా, సమయ ప్రణాళిక, క్లిష్టమైన రక్షణ సంబంధిత అంశాలతో సహా అనేక కీలక వ్యవస్థలపై ప్రభావం చూపుతుందని పేర్కొంది. డిసెంబర్ 2020లో భారతదేశ అంతరిక్ష ఆస్తులను పర్యవేక్షించడం, రక్షించడం లక్ష్యంగా ఎస్ఎస్ఏ కార్యకలాపాల కోసం ప్రత్యేక నియంత్రణ కేంద్రాన్ని ఇస్రో ప్రారంభించింది. ఇక్కడ పీన్యాలోని ఇస్ట్రాక్ (ఇస్రో టెలిమెట్రీ, ట్రాకింగ్, కమాండ్ నెట్‌వర్క్) క్యాంపస్‌లో ఇది ఏర్పాటయింది.

పశ్చిమ బెంగాల్‌లో సీపీఎం నుంచి సీపీఐలో చేరిక

సిలిగురి: పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో సీపీఎం నాయకులు అనేకమంది మాతృసంస్థ సీపీఐలో చేరారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పార్థ మొయిత్రా నాయకత్వంలో వీరు ఆదివారం సీపీఐ డార్జిలింగ్ జిల్లా కార్యదర్శి అనిమేశ్ బెనర్జీ నేతృత్వంలో సీపీఐలో చేరారు. మొయిత్రా తోపాటు జిల్లాలో సీపీఎం యువజన నాయకులుగా గుర్తింపు పొందిన జ్యోతి దే సర్కార్, ఉజ్వల్ ఘోష్, విపుల్ ఘోష్, విజయ్ చౌదరి, అరిజిత్ గంగూలీ తదితరులు సీపీఐలో చేరిన వారిలో ఉన్నారు. "అన్నిటికి అవునన్ కొంతమంది వ్యక్తుల అజమాయిషిలో సీపీఎం నడుస్తోంది. అందువల్ల మేము పార్టీని వీడాం. అయితే, అధికారం కోసం పాలక టీఎంసీలో మేము చేరడంలేదు. వామపక్ష భావాలు కలిగిన సంస్థలోనే పనిచేయడం కొనసాగాలని మేము నిర్ణయించాం. అందుకే సీపీఐలో చేరుతున్నాం" అని మొయిత్రా వెల్లడించారు. వీరిని సీపీఐలోకి ఆహ్వానిస్తూ, వీరి చేరికతో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని బెనర్జీ అన్నారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇదే జిల్లాకు చెందిన సీపీఎం నాయకుడు శంకర్ ఘోష్ ఇదే విధమైన విమర్శలతో పార్టీని వీడి బీజేపీలో చేరారు. ప్రస్తుతం ఆయన సిలిగురి ఎమ్మెల్యేగా ఉన్నారు.

ములాయం సింగ్ భార్య అంత్యక్రియలు పూర్తి

లక్నో: సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పీ) వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ రెండవ భార్యసాధనా గుప్తా అంత్యక్రియలు ఆదివారం పూర్తయ్యాయి. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సాధనా గుప్తా శనివారం హరియాణలోని గురుగ్రామ్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె మృత దేహాన్ని లక్నోకు తరలించిన ములాయం సింగ్ కుటుంబ సభ్యులు ఆదివారం నగరంలోని పిప్రా ఘాట్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అంతిమ యాత్ర వాహనంలో ములాయం సింగ్ యాదవ్, అఖిలేశ్ యాదవ్, తమ్ముడు శివపాల్ సింగ్ యాదవ్ తదితరులు ఉన్నారు. సాధన అంత్యక్రియల్లో ములాయం సింగ్ కుటుంబ సభ్యులందరూ పాల్గొన్నట్టు స్థానిక మీడియా నివేదించింది. అంతిమయాత్రకు ముందు సీఎం యోగి ఆదిత్యనాథ్, మాజీ ఉప ముఖ్యమంత్రి దినేష్ శర్మ తదితరులు ములాయం సింగ్ యాదవ్ నివాసానికి వెళ్లి సంతాపం తెలిపారు.

శాశ్వత అధ్యక్షుడు అనేది ప్రజా ప్రాతినిధ్య చట్టానికి విరుద్ధం

ఎన్నికల కమిషన్ ఎలా స్పందిస్తుందో చూడాలి
సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

హైదరాబాద్: ఏపీ సీఎం జగన్ వైసీపీకి శాశ్వత అధ్యక్షుడిగా కొనసాగేలా పార్టీ నిబంధనావళిని మార్చుకున్న అంశంపై సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ స్పందించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం -1951లోని సెక్షన్ 29-ఏ ప్రకారం అది చెల్లుబాటు అవకాశం లేదని పేర్కొన్నారు. ఆ చట్టం ప్రకారం భారత ఎన్నికల సంఘం గుర్తింపు ఉండి, ఎన్నికల గుర్తు కూడా ఉన్న ఏ పార్టీలో అయినా అంతర్గత ప్రజాస్వామ్యం, ఎన్నికల ప్రక్రియ ఉండాలనే నిబంధన ఉందని తెలిపారు. ఆ చట్టం నిబంధల ప్రకారం రెండేళ్లకో... మూడేళ్లకో పార్టీలోనూ అంతర్గత ఎన్నికలు నిర్వహించి అధ్యక్ష, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ చాలా కాలం ఇలా వ్యవహరించపోతే ఎన్నికల సంఘం నోటీసులు కూడా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే తాజాగా ఇందుకు భిన్నంగా వైసీపీ ప్లీనరీలో జగన్‌ను ఆ పార్టీకి శాశ్వత అధ్యక్షుడిగా తీర్మానిస్తూ నిబంధనల్ని మార్చడం ప్రజా ప్రాతినిధ్య చట్టానికి, సెక్షన్ 29- ఏకి విరుద్ధంగా పేర్కొన్నారు. ఈ క్రమంలో వైసీపీ శాశ్వత అధ్యక్షుడిగా జగన్ నియామకం చెల్లుతుందా లేదా అనే విషయంపై ఎన్నికల సంఘం ఎలా స్పందిస్తుందో తెలియదని చెప్పారు.ఏ పార్టీకి అయినా ఇటువంటి నిర్ణయం వర్తిస్తుందా అనేది చర్చ జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు చట్టపరంగా చెల్లుబాటు అవుతాయా అనే విషయంపై తేల్చుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు.

పోలవరం స్పిల్‌వే గేట్ల ఎత్తివేత

విశాలాంధ్ర – ఏలూరు: పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే 48 గేట్లు ఎత్తారు. 2.32 లక్షల క్యూసెక్కుల నీరు గోదావరిలోకి విడుదవుతున్నాయని గేట్ల పర్యవేక్షణ ఈఈ చెప్పారు. స్పిల్‌వే వద్ద నీటిమట్టం 28 మీటర్లకు పెరిగింది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువకు 1.20లక్షల క్యూసెక్కుల వరద వదులుతున్నారు. నదీ తీర గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఆదివారం రాత్రికి భద్రాద్రి వద్ద గోదావరి 43 అడుగులకు చేరుకునే అవకాశం ఉందని సిడబ్ల్యుసి వెల్లడించింది. చింతలపూడి(మం) నాగిరెడ్డిగూడెం వద్ద తమ్మిలేరు జలాశయానికి వరద నీరు చేరుతోంది. జలాశయం సామర్థ్యం 355 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 332 అడుగులు ఉంది. ప్రస్తుతం ఇన్ ఫ్లో 100 క్యూసెక్కులు.

ప్లీనరీ జనసంద్రం

వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి



విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: వైసీపీ ప్లీనరీ పార్టీ కార్యకర్తల్లో మహోత్సాన్ని నింపిందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వైసీపీ ప్లీనరీ సమావేశాలు విజయవంతం కావడానికి కృషి చేసిన పార్టీ కార్యకర్తలకు, జగన్ అభిమానులకు, పార్టీలో ఉన్న ప్రతి ఒక్కరికీ, పార్టీ అధ్యక్షుడు జగన్ తరపున ఆయన ధన్యవాదాలు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ జీవిత కాల అధ్యక్షుడిగా ఎన్నుకోవడం సువర్ణ అధ్యాయమని చెప్పారు. రెండు రోజులు పాటు జరిగిన ప్లీనరీ సమావేశాలకు లక్షలాదిగా ప్రజలు స్వచ్ఛందంగా రావడంతో ప్రాంగణం అంతా జనసంద్రంగా మారిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేదల శ్రేయస్సే లక్ష్యంగా ఈ సమావేశాల్లో నిర్ణయాలు జరిగాయని చెప్పారు. సామాజిక, ఆర్థిక, రాజకీయంగా మహిళా సాధికారతే వైసీపీ లక్ష్యమని ఆయన తెలిపారు. ఆర్బీకేలు, వాలంటీర్ వ్యవస్థ, వైద్య, విద్యా రంగాల్లో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులను ప్రపంచం అంతా ప్రశంసిస్తుంటే ఒక్క చంద్రబాబు నాయుడు మాత్రం విమర్శించడం అతడి భావ దారిద్ర్యానికి నిదర్శమన్నారు. మహా సముద్రాన్ని తలపించేలా జన ప్రవాహం, ఉప్పెనలాగా జనమంతా ప్లీనరీకి తరలివచ్చారన్నారు. అధ్యక్షుడు జగన్ ప్రసంగం వినడానికి జడివానను కూడా లెక్క చేయకుండా చెక్కు చెదరని విశ్వాసంతో లక్షలాదిమంది ప్రాంగణంలో నిలబడి ఉన్నారన్నారు. చంద్రబాబుకు మతి భ్రమించిందని విమర్శించారు. 40ఏళ్ల ఇండస్ట్రీ అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబును,నాలుగు పదుల వయసు ఉన్న జగన్‌ను ఎదుర్కోవాలని సవాల్ విసిరారు. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన, మిగతా పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్లీనరీ అయిపోయిన తర్వాత వేమూరు నియోజకవర్గానికి చెందిన పార్టీ అభిమాని, వాలంటీర్‌గా కూడా పనిచేస్తున్న దినేష్... ప్రమాదవశాత్తూ బస్సుకింద పడి చనిపోవడం జరిగిందన్నారు. వేమూరు నియోజకవర్గానికి చెందిన శాసనసభ్యుడు, మంత్రి మేరుగ నాగార్జున ద్వారా రూ.5లక్షలు వైసీపీ తరపున ఆ కుటుంబానికి అందజేస్తున్నామని చెప్పారు. విలేకరుల ప్రశ్నలకు సమాధానమిస్తూ... విజయమ్మ తన రాజీనామా గురించి స్పష్టంగా చెప్పారన్నారు. ఒకేసారి రెండు పార్టీల్లో పదవుల్లో ఉండటం సరికాదని, తెలంగాణలో షర్మిలమ్మకు అండగా నిలవాల్సిన అవసరం ఉన్నందున అక్కడకు వెళుతున్నట్లు పేర్కొన్నారన్నారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, వంశీకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

శ్రీలంకకు అండగా నిలుస్తాం: భారత్

దిల్లీ: శ్రీలంకలోని ప్రస్తుత పరిస్థితిని నిశితంగా గమనిస్తున్న భారత్ ఆదివారం ఓ ప్రకటన చేసింది. లంక ప్రజలకు అండగా ఉంటామని వెల్లడించింది. ప్రజా స్వామ్య మార్గాలు, రాజ్యాంగ విలువలు, పురోగతి కోసం ప్రయత్నిస్తున్న శ్రీలంక ప్రజలకు భారత్ అండగా నిలుస్తుందంటూ విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ద్వీప దేశంలో ఆర్థిక సంక్షోభం మొదలైనప్పటి నుంచి భారత్ దన్నుగా నిలుస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా మరోసారి గుర్తుచేసింది. ఇప్పటివరకు 3.8బిలియన్ డాలర్ల సాయమందించామని ఇకపైనా ఈ సాయాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేసింది. 'శ్రీలంక, ఆ దేశ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సవాళ్ల గురించి మాకు తెలుసు. ఈ క్లిష్ట కాలాన్ని అధిగమించేందుకు ప్రయ త్నిస్తున్న ప్రజలకు మేం అండగా నిలుస్తాం' అంటూ పేర్కొంది. శ్రీలంకకు పొరుగున ఉన్న భారత్ అత్యంత సన్నిహిత దేశమని, ఈ రెండు దేశాలు లోతైన నాగరికత బంధాలను పంచుకుంటున్నాయంటూ రెండు దేశాల మధ్య సంబంధాలు, ప్రాముఖ్యతలను గుర్తుచేసింది.

తీర్పు పేరుతో అమానుషం.. వ్యక్తి సజీవదహనం

గువాహటి: అస్సాంలోని నాగోన్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ప్రజలు, గ్రామ పెద్దల సమక్షంలో ఓ వ్యక్తిని సజీవ దహనం చేశారు. శనివారం గ్రామ పంచాయతీలో జరిగిన బహిరంగ విచారణలో తీర్పు వెల్లడించి ఈ అమానుషానికి ఒడిగట్టారు. బోర్ లాలుగావ్ గ్రామానికి చెందిన రంజిత్ బార్డోలోయ్‌పై హత్యారోపణలు ఉన్నాయి. ఓ మహిళ హత్య కేసులో దోషిగా తేల్చి.. అతడిని అందరి ముందే సజీవ దహనం చేశారు. అనంతరం పూడ్చిపెట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పూడ్చిపెట్టిన మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. శరీరం 90 శాతం కాలిపోయినట్లు పేర్కొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు.

ఘటనపై కేసు నమోదు చేసుకుని అనేకమందిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. 'బోర్ లాలుగావ్‌లో బహిరంగ విచారణలో ఓ వ్యక్తిని సజీవ దహనం చేసినట్లు సమాచారం అందింది. ఓ మహిళ హత్య కేసులో దోషిగా తేలడం వల్ల హత్య చేసి పూడ్చి పెట్టారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నాం. కొంతమందిని అదుపులోకి తీసుకున్నాం' అని డీఎస్పీ ఎం.దాస్ వెల్లడించారు.



స్టార్టప్ నిధుల్లో 40 శాతం క్షీణత

భౌగోళిక-రాజకీయ అస్థిరత ప్రభావం
పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక



న్యూదిల్లీ: భారత స్టార్టప్‌లపై భౌగోళిక, రాజకీయ అస్థిరత ప్రభావం చూపుతున్నట్లు పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక పేర్కొంది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో మొత్తం నిధులు 40 శాతం క్షీణించి 6.8 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు తెలిపింది. 'స్టార్టప్ డీల్స్ ట్రాకర్-క్యూ2 సివై22' పేరుతో పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక ప్రకారం, ప్రారంభ దశ ఒప్పందాలు మొత్తం 60 శాతానికి పైగా సగటు టికెట్ పరిమాణం 5 మిలియన్ డాలర్లతో ఉన్నాయి. 'వరుసగా మూడు త్రైమాసికాలలో 10 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ సేకరించిన తర్వాత, క్యూ2 సివై22 సమయంలో భారత స్టార్టప్ పర్యావరణ వ్యవస్థలో మొత్తం నిధులు 40 శాతం తగ్గి 6.8 బిలియన్ డాలర్లకు చేరాయి. 'ఈ క్షీణతకు ప్రపంచ మందగమనం, టెక్ స్టాక్ విలువ తగ్గుదల, ద్రవ్యోల్బణం, భౌగోళిక, రాజకీయ అస్థిరత కారణమని చెప్పవచ్చు' అని వివరించింది. క్యాలెండర్ సంవత్సరం (సీవై) 2022 రెండవ త్రైమాసికంలో సాఫ్ట్‌వేర్ యాజ్ ఎ సర్వీస్ (ఎస్ఏఏఎస్) ఫిన్‌టెక్ కంపెనీలు అత్యధిక నిధుల వాటాను కలిగి ఉన్నాయి. మొత్తం 3.1 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ అని నివేదిక పేర్కొంది. 'క్యూ2సీవై22లో ప్రారంభ దశ ఒప్పందాలలో నిధులు దాదాపు 800 మిలియన్ డాలర్ల వద్ద స్థిరంగా కొనసాగాయి. తదుపరి కొన్ని త్రైమాసికాల్లో స్థిరంగా లేదా వృద్ధి చెందవచ్చు. పెరిగిన డిజిటలైజేషన్, వ్యవస్థీకృత మూలధన పరిమాణంతో వ్యవస్థాపక కార్యకలాపాలు వృద్ధి చెందుతూనే ఉన్నాయి. భారత మార్కెట్‌లో వినియోగించడానికి నిధులు వేచి ఉన్నాయని తెలిపింది. డీల్స్ అండ్ ఇండియా స్టార్టప్స్ నాయకుడు అమిత్ నవ్కా మాట్లాడుతూ 'మొత్తం నిధుల స్థిరీకరణకు 12 నుంచి 18 నెలల సమయం పడుతుందని మేము భావిస్తున్నాము. ఈ సమయంలో స్టార్టప్‌లు తమ 'ఫండింగ్ రన్‌వే'ని పెంచుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది' అని తెలిపారు. దేశంలో బెంగళూరు, నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్ఆర్సీ), ముంబై కీలకమైన స్టార్టప్ నగరాలుగా కొనసాగుతున్నాయని, 2022 ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో మొత్తం నిధుల కార్యకలాపాల్లో 95 శాతం వాటాను అందిస్తున్నాయని, ఆ తర్వాత చెన్నై, పూణే ఉన్నాయని నివేదిక పేర్కొంది. క్యాలెండర్ సంవత్సరం 2022 రెండవ త్రైమాసికంలో భారతదేశంలో కేవలం నాలుగు స్టార్టప్‌లు మాత్రమే యునికార్న్ హోదాను పొందాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.